ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 8 ఆగస్టు 2025




సంపదలివ్వు తల్లీ..!

- నేడు వరలక్ష్మీ వ్రతం
- మార్కెట్‌లలో సందడి



అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రత నిర్వహణకు మహిళలు సిద్ధమయ్యారు. పూజా సామగ్రిని ముందురోజే సమకూర్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్కెట్‌లు కొనుగోలుదారులతో సందడిని సంతరించుకున్నాయి. ఏటా శ్రావణ మాసం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన వరలక్ష్మీ దేవిని ఆరాధిస్తూ వ్రతాలను ఆచరిస్తారు. వేకువనే నిద్రలేచి, ముంగిట కల్లాపి చల్లి, గడపకు పసుపు పట్టించి, మామిడి ఆకుల తోరణాలు కడతారు. విశాలమైన గదిలో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి, సంకల్పం, సహస్రనామార్చనాది పూజలను నిర్వహిస్తారు. తొమ్మిది రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. తొమ్మిది ముడులతో తయారు చేసిన కంకణాలను అమ్మవారి ముందు ఉంచి పూజిస్తారు. ఈ కంకణాలను పూజల్లో పాల్గొన్న మహిళల కుడిచేతికి కట్టి, పిండివంటలను వాయనాలుగా అందజేయడంతో వ్రతం పరిసమాప్తమవుతుంది.



దేవతలకు ఇష్టమైన మాసం...

జగన్మాత మూడురూపాల్లో లక్ష్మీదేవి రూపం ఒకటి. తనను భక్తిశ్రద్ధలతో కొలిచేవారికి సిరిసంపదలను ప్రసాదించే దేవత వరలక్ష్మి. శ్రావణం దేవతలకు ఇష్టమైన మాసం. ఈ మాసంలో మహిళలు భర్తతో కలిసి వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తే విశేష ఫలితాలు ఉంటాయి.

-కిశోర్ శర్మ, పురోహితుడు



సకల సంపదలు..

మహిళలకు భక్తిశ్రద్ధలు ఎక్కువ. వరలక్ష్మీ వ్రతంలో ఇది ప్రతిబింబిస్తుంది. ఈ వ్రతాన్ని నిష్ఠగా ఆచరించేవారికి పుట్టినింట, మెట్టినింట ప్రేమాభిమానాలు పెరుగుతాయి. సకల సంపదలు సిద్ధిస్తాయి. అందుకే వరలక్ష్మీ వ్రతం కోసం మహిళలు ఏడాదంతా ఎదురుచూస్తుంటారు.

- నాగేశ్వరి, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యురాలు



జనంతో పాతూరు కిటకిట..




బియ్యం.. బొక్కేస్తున్నారు..!




పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం

- కొందరు డీలర్ల నుంచే నేరుగా వ్యాపారులకు..
- కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయం
- తేటతెల్లం చేస్తున్న బఫర్ లెక్కలు
- ఒక్కో షాపు నుంచి ప్రతినెలా 20 సంచుల వరకు..
- అనంతపురం నగరం, పట్టణాల్లోనే అధికం

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని బొక్కేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎ‌స)లో ఏకంగా బియ్యం సంచులే మాయమవుతున్నాయి. నేరుగా వ్యాపారులకు బియ్యం చేరుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అందుకు ఎఫ్‌పీ షాపుల్లో కనిపిస్తున్న బఫర్ స్టాకే నిదర్శనం. కొన్ని దుకాణాల్లో పదుల సంఖ్యలో బియ్యం బస్తాల కొరత కనిపిస్తోంది. పేదల బియ్యం ద్వారా డబ్బు దోచుకునే వ్యవహారం గత వైసీపీ హయాంలో జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు డీలర్లు కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ముడుపులతో చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రజలకు అందాల్సిన బియ్యం కొందరు అక్రమార్కుల పాలవుతోంది. ఈ దందా జిల్లా కేంద్రమైన అనంతపురంతోపాటు పట్టణాల్లోనే ఎక్కువగా సాగుతోంది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోనూ పెద్దఎత్తున పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది.

భారీ బఫర్...

రేషన్ షాపుల్లో కనిపిస్తున్న బఫర్ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతోందో తేటతెల్లం చేస్తుంది. జిల్లావ్యాప్తంగా 1,645 రేషన్ దుకాణాలు ఉండగా... 6.25 లక్షల మంది కార్డుదారులున్నారు. ప్రతినెలా సుమారు 10వేల టన్నుల పీడీఎస్ బియ్యం సరఫరా అవుతుంది. అనంతపురం నగరంలో 137 ఎఫ్‌పీ షాపులున్నాయి. ప్రతి బస్తా లో 50 కిలోల పీడీఎస్ బి య్యం ఉంటుంది. వాటి లో 80 నుంచి 100 బస్తాలు

(మిగతా 6లో...)

డీలర్ల నుంచి నేరుగా వ్యాపారులకు...

జిల్లాలో చాలామంది బియ్యం వ్యాపారులు ఉన్నారు. వీరంతా మేలు రకాలైన బియ్యం వ్యాపారం చేసేవారు కాదు. రేషన్ షాపుల్లో పేదలకు అందించే బియ్యం కొనుగోలు చేసి పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి అధిక ధరలకు విక్రయిస్తుంటారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి వ్యాపారులు కొంతకాలంగా పెరుగుతున్నారు. పెద్దమొత్తంలో సబ్సిడీ బియ్యం లభిస్తుండడంతో దందా సాగిస్తున్నారు. రేషన్‌షాపు డీలర్ల నుంచే పీడీఎస్ బియ్యం వీరికి వెళ్తోంది. బఫర్‌లో కనిపిస్తున్న లెక్కల వివరాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. కీలకమైన డీలర్ షాపుల నుంచి 5 నుంచి 10 బస్తాల వరకు వెళ్తుండగా, మరి కొందరి నుంచి 20 బస్తాలదాకా కూడా పక్కదారి పడుతునట్టు సమాచారం. కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.

చేనేతకు పుట్టినిల్లు అనంత

- జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్వో రామకృష్ణారెడ్డి

అనంతపురం వైద్యం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతకు అనంతపురం జిల్లా పుట్టినిల్లు అని చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ నుంచి ఆప్కో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ డీఆర్వో రామకృష్ణారెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, ఏడీ వరప్రసాద్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆప్కో కార్యాలయంలో చేనేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోందన్నారు. జీఎస్టీ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. అనంతరం చేనేత రంగంలో విశేష కృషి చేసిన ఆరుగురిని సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహ, చేనేత సంఘం నాయకులు నరసింహులు, డీఓ బసవ రాజు, ఏడీఓలు, ఆప్కో ఏఓ, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రావతి సుందరీకరణకు శ్రీకారం

పనులకు జోయాలుక్కాస్ రూ.1.2 కోట్ల విరాళం (వివరాలు 7లో...)

రాబందులు వచ్చేశాయ్..!

టేకులోడు సెజ్‌లో దళారులు పాగా



- చిన్న వివాదాలతో రైతుల్లో ఆందోళన సృష్టి
- సమస్యను పరిష్కరిస్తామని రూ.లక్షల్లో వసూలు
- ఇద్దరు అధికారుల అండతో సెటిల్‌మెంట్లు

చిలమత్తూరు మండలంలోని టేకులోడు సెజ్‌లో దళారులు పాగా వేశారు. పరిశ్రమల కోసం ప్రభుత్వ చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భూములు కోల్పోయిన రైతుల కంటే వీరే ఎక్కువ లబ్ధిపొందుతున్నారు. మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి సేకరిస్తోంది. ఇందులో భాగంగా టేకులోడు రెవెన్యూ గ్రామంలో రైతుల నుంచి భూములను సేకరించి వారికి పరిహారాన్ని అందిస్తోంది. ఇదే అదనుగా భావించిన కొందరు దళాలరుల అవతారం ఎత్తి అమాయక రైతులను భయపెట్టి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు అధికారులు దళారులకు అండగా ఉంటూ వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం.

టేకులోడు వద్ద ప్రభుత్వం సేకరిస్తున్న భూములు



చిలమత్తూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): టేకులోడు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించింది. రైతులు సాగులో ఉన్న 600 ఎకరాల అసైన్డ్ భూములను సేకరిస్తోంది. ఎకరానికి రూ. 12,66,067లుగా ప్రభుత్వం పరిహారాన్ని అందిస్తోంది. ఇదే అదనుగా కొందరు దళారుల అవతారం ఎత్తి అమాయక రైతులను టార్గెట్ చేస్తున్నారు. ప్రధానంగా చిన్న చిన్న భూసమస్యలు ఉన్న రైతులను గుర్తించి వారికి లేనిపోని భయాలను పుట్టిస్తున్నారు. భూమి వివాదాస్పదంగా ఉందని, పరిహారం ఇవ్వడం కుదరదని తమతో కలిస్తే అధికారులతో మాట్లాడి పరిహారం అందేలా చేస్తామని చెప్తున్నారు. ఒకవేళ తమతో కలిసిరాకపోతే మీ భూమికి పరిహారం వెనక్కి పోతుందని (మిగతా 6లో...)

అహుడా పెండింగ్ పనులను

పూర్తిచేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని ఎంఐజీ లే అవుట్లలో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న లే అవుట్ల అభివృద్ధికి సంబంధించిన విషయాల గురించి ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణాలలో సరసమైన ధరలకు రెసిడెన్షియల్ ప్లాట్లు అందుబాటులో ఉంచుతోందని అన్నారు. ఈ లేఅవుట్లలో ఇప్పటివరకు కేటాయించని ప్లాట్లను కమర్షియల్ ఆక్షన్ విధానంలో అమ్మడానికి, అనేక రకాల ఆదాయ వర్గాల వారికి, ఒకే కుటుంబంలో ఎంతమందికైనా కొనటానికి వెసులుబాటు కల్పించామని తెలిపారు. అనంతపురం, రాప్తాడు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని లే అవుట్లలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని అన్నారు. బుకింగ్ కాని ప్లాట్లకు త్వరలో కమర్షియల్ ఆక్షన్ విధానంలో అమ్మడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గుంతకల్లు-గుత్తి లేఅవుట్, అనంతపురం రూరల్ మండలంలోని రాచానపల్లి, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గం తడకలేరు తదితర ప్రాంతాల్లో కమర్షియల్, మల్టీప్లెక్స్ కాంప్లెక్స్ కన్వెన్షన్ హాల్ అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించే వరకూ

విశ్రమించొద్దు

- విద్యార్థులకు ఎస్పీ జగదీష్ సూచన
- పోలీసు పిల్లలకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎస్పీ ఇతర అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం సాధించేవరకూ పట్టు వదలకుండా కృషి చేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు. ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2024-25 విద్యాఏడాదిలో 10వ తరగతి, ఇంటర్, ఎంటెక్, ఎంబీఏలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు ఉద్యోగుల పిల్లల్లో ప్రతిభను గుర్తిస్తూ మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం పట్టుదల, కృషితో ముందుకెళ్లాలన్నారు. ఏ స్థాయికెళ్లినా తల్లిదండ్రులను మరువకూడదన్నారు. తర్వాత 107 మంది పోలీసు పిల్లలకు రూ.6.23 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్ సొమ్ము అందించారు. ప్రోత్సాహక నగదు, ప్రశంసాపత్రాలతో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐలు ధరణీకిషోర్, దేవానంద, వంశీకృష్ణ, హరినాథ్, ఆర్‌ఐలు మధు, పవన్‌కుమార్, రాముడు, పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిని విస్తరించాల్సిందే..!

- వైద్య బృందం
- ఆస్పత్రిలో పలు విభాగాల పరిశీలన

ఆంధ్రజ్యోతికి స్పందన



ఫిమేల్ సర్జికల్ వార్డును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, డాక్టర్లు జగన్నాథ్, ఆత్మారామ్

అనంతపురం వైద్యం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిని విస్తరించాల్సిందేననే అభిప్రాయానికి వైద్య బృందం వచ్చింది. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ నేతృత్వంలో కలెక్టర్ ఏర్పాటు చేసిన వైద్య బృందం గురువారం ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించింది. అక్కడి రోగులతో సమస్యలపై ఆరా తీసింది. ఈ నేపథ్యంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే ఆస్పత్రిని విస్తరించాల్సిందేననే అభిప్రాయానికి వచ్చింది. ఆమేరకు నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. రెండు దశాబ్దాల కిందటే బోధనాస్పత్రిగా మారిన పెద్దాస్పత్రిలో నేటికీ మంచాలు(బెడ్) పెంచలేదు. వార్డులు, ఓపీలు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు పాత భవనాల్లోనే కొన సాగుతున్నాయి. 2014-19లో మాత్రం చిన్నపిల్లల వార్డు, అత్యవసర విభాగాన్ని విస్తరించారు. డాక్టర్లు, సిబ్బందిని మాత్రం తగిన సంఖ్యలో నియమించలేదు. రోగుల తాకిడి మాత్రం రెండింతలు పెరిగింది. ఈ నేపథ్యంలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల లేమి తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురిత మయ్యాయి. ఆస్పత్రిని బాగుచేయాలని ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆత్మారామ్ గట్టిగా పట్టుపట్టారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ఆయన ఆస్పత్రిలో విషయాలు తెలుసుకోవడానికి అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ నేతృత్వంలో రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్నాథ్, దివ్యశ్రీ నర్సింగ్ హోమ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామ్‌మోహన్, స్నేహలత హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. దీంతో వారు గురువారం ఆసుపత్రిలో విభాగాల వారిగా తనిఖీ చేసి, వివరాలు నమోదు చేసుకున్నారు.

చిక్కింది చాన్స్ అని..

మహిళా సంఘాల సొమ్ము స్వాహా

- రూ.30లక్షల మేర కాజేసిన వైనం
- రికవరీకి అధికారుల ప్రయత్నాలు
- పోలీసులకు మహిళా సంఘాల ఫిర్యాదు
- ఆకుతోటపల్లిలో ఓ యానిమేతర్..!

అనంతపురంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో సభ్యుల నమ్మకాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు యానిమేటర్లు స్వాహా పర్వానికి తెర తీశారు. ఇలాంటి వ్యవహారమే రూరల్ మండలంలోని ఆకుతోటపల్లిలో వెలుగులోకి వచ్చింది. అక్కడ పని చేసే ఓ యానిమేటర్ మహిళా సంఘాల సొమ్మును తన ఖాతా లోకి మళ్లించుకుని స్వాహా చేశారు. ఇలా దాదాపు రూ.30 లక్షల మేర కాజేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికా రులు వ్యవహారం బయటకు పొక్కకుండా యానిమేటర్‌తో రికవరీ చేయిస్తున్నారు.

పొదుపు.. అప్పుల విచారణతో వెలుగులోకి

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో పని చేస్తున్న యానిమేటర్‌ను తొలగించారు. అతడి స్థానంలో అప్పటి రాజకీయ నాయకుల ఒత్తిడితో ఓ మహిళను యానిమేటర్‌గా నియమించారు. 2021 ఆగస్టు నుంచి 2024 జూన్ ఆఖరి వరకు ఆమె పని చేశారు. ఆ సమయంలోనే మహిళల సొమ్ము స్వాహా జరిగినట్లు తెలుస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి యానిమేటర్ మార్పు జరిగింది. ఈక్రమంలో గ్రూపులు, సభ్యుల అప్పులు, పొదుపు వివరాల విచారణ క్రమంలో స్వాహా వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

నమ్మకం, అమాయకత్వమే ఆసరా

గ్రామాల్లో చాలా మంది కూలి పనులు, వ్యవసాయ పనులు ఇతరత్ర వాటికి వెళ్లి జీవనం సాగిస్తుంటారు. అలా వచ్చిన సొమ్మును డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు చేసుకుంటారు. అవసరార్థం సంఘంలో అప్పు తీసుకుని నెల..నెలా చెల్లిస్తారు. ఈక్రమంలో చాలా మంది యానిమేటర్‌ను మీదనే ఆధారపడి చెల్లింపులు చేస్తుంటారు. ఇదే ఆసరగా ఆ యానిమేటర్ గ్రూపు సభ్యుల సొమ్మును కాజేసినట్లు తెలు స్తోంది. ఈక్రమంలో రూ.పదిహేను లక్షలకుపైగానే కాజేసినట్లు తెలుస్తోంది. తనకంటూ ఓ ప్రత్యేక తీర్మానం చేసుకుని గ్రూప్రుసభ్యులతో సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో తన సొంత (మిగతా 6లో..)



మండల ఏపీఎం కార్యాలయం

అన్నదాత ఎదురుచూపు

- పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము జమలో జాప్యం
- కొందరికి ఒక్కటే పడిన వైనం
- రైతు సేవాకేంద్రాలకు రైతుల పరుగులు (7లో...)

53 డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

31 వరకూ స్పెషల్ డ్రైవ్: ఎస్పీ జగదీష్

(వివరాలు 7వ పేజీలో..)

పుట్టపర్తికి నిధులివ్వండి

కేంద్ర మంత్రికి ఎంపీ బీకే వినతి



కేంద్ర పర్యాటక మంత్రి షెఖావత్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకే

పెనుకొండ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు ఇవ్వాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్‌కు హిందూపురం ఎంపీ పార్థసారధి విన్నవించారు. అభివృద్ధి ప్రణాళికను పరిశీలించి, ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ గురువారం వినతి పత్రం సమర్పించారు. ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. భగవాన్ సత్యసాయి బాబా జన్మస్థలమైన పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోందని వివరించారు. అనేక దేశాల భక్తులు పుట్టపర్తిని సందర్శిస్తున్నారని అన్నారు.అలాంటి పుట్టపర్తిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి వివరించారు.

సెలవుల సందడి

ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో ప్రధాన పండుగలైన వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి వరుసగా రావడం, ఆ మరుసటిరోజే ఆదివారం సెలవు కావడంతో జిల్లావ్యాప్తంగా సందడి వాతావరణం కనిపిస్తోంది. విద్యాసంస్థలకు వరుసగా మూడురోజులు సెలవులు వదలడంతో విద్యార్థులంతా సొంతూరి బాట పట్టారు. దీంతో గురువారం అనంతపురం బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. తమ ఊరి బస్సులో సీట్లు పట్టుకునేందుకు పిల్లలు, పెద్దలు ఎగబడ్డారు. బస్సు సర్వీసులు తక్కువగా ఉండే రూట్లలో తమ ఊరి బస్సు ఎప్పుడొస్తుందా అంటూ ప్రయాణికులు వేచిచూడడం కనిపించింది. మొత్తంగా వరుస సెలవుల కారణంగా గురువారం రీజియన్ వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లన్నీ కిక్కిరిసిపోయాయి.



అనంతపురం: మా ఊరి బస్సు ఎప్పుడొస్తుందో.. ఏమో..





సీటు దొరికితే చాలు.. పండుగే..



వామ్మో.. ఏమి జనం..! ఇసుకేస్తే నేలరాలదంతే..!

చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

● ఏపీ చేనేత సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ చేనేత సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు డిమాండ్ చేశారు. ఏపీ చేనేత సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలో నేతన్నలు భారీ ర్యాలీ నిర్వహించారు. నేత బజార్ వద్ద నేతన్నల మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.36వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి రూ.7లక్షలు చెల్లిస్తామని విస్మరించడం దారుణమన్నారు. చేనేతలకు బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య మాట్లాడుతూ చేనేతలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ర్యాలీలో పురుషోత్తం, వెంకటరమణ, శేఖర్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో చేనేత కార్మికుల ర్యాలీ

మహాత్మా...! కళ్లు తెరిపించు

● గాంధీ విగ్రహానికి చేనేతల వినతి

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహాత్మా..! పాలకుల కళ్లు తెరిపించి, చేనేత కార్మికులను కాపాడేలా చూడాలని గాంధీ విగ్రహానికి ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎస్‌హెచ్‌బాషా వినతి పత్రం ఇచ్చారు. జాతీయచేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ రద్దు, నేతన్న నేస్తం వంటి హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేశ్, చేనేత కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఖాదర్‌బాషా, గుంపుహరి, జంగాలపల్లిపెద్దన్న, జేవీరమణ, మారుతి, అయూబ్‌ఖాన్,ఎల్ ఆదినారాయణ, వెంకటస్వామి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చేనేత కార్మికసంఘం, కాంగ్రెస్ నాయకులు

జాతీయ అవార్డు అందుకున్న ధర్మవరం డిజైనర్

ధర్మవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ జుజూరు నాగరాజు కేంద్ర మంత్రి నుంచి జాతీయ అవార్డును అందుకున్నారు. దేశరాజధాని న్యూఢిల్లీలో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం గురువారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దేశంలోని పలువురు చేనేత కార్మికులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈక్రమంలోనే పట్టు చీరలపై అద్భుతాలు సృష్టించి, ఎన్నో పురస్కారాలు అందుకున్న నాగరాజును గుర్తించి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, ఎంపీ కంగనారనౌత్, హ్యాండ్‌లూమ్ కమిషనర్ బీనా, ఇతరశాఖల మంత్రులు, అధికారుల చేతుల మీదుగా నాగరాజుకు అవార్డును అందజేశారు.



కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ నుంచి జాతీయస్థాయి అవార్డు అందుకుంటున్న డిజైనర్ జుజూరు నాగరాజు

చిక్కింది చాన్స్ అని..

(5వ పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతా నెంబరు రాసుకుని తీర్మాన కాపీలను బ్యాంకులో ఇచ్చి..రుణాలు, ఇతరత్ర సొమ్ము మరో రూ.14లక్షలు తన ఖాతాలో జమ చేసుకున్నట్లు తెలుస్తోంది. తన పరిధిలోని ఒక్కో గ్రూపులో రూ.యాభై వేలు మొదలు కొని..రూ.లక్ష, రెండు లక్షలు, నాలుగు లక్షల వరకు గ్రూపు సభ్యులకు తెలియకుండా సొమ్మును తన సొంత ఖాతాలోకి జమచేసుకున్నట్లు సమాచారం. దాదాపు పది గ్రూపులకు సంబంధించిన సభ్యుల సొమ్మును ఎవరికి అనుమానం రాకుండా కాజేసినట్లు చర్చసాగుతోంది.

గుట్టుగా రికవరీ

డ్వాక్రా సంఘంలో జరిగిన అవినీతిని తెలుసుకున్న సంబంధిత అధికారులు గుట్టుచప్పుడుకాకుండా రికవరీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల లెక్కప్రకారమే రూ.20లక్షలకు పైగానే సొమ్ము స్వాహా అయినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున అవినీతి జరిగినప్పటికీ ఉన్నతాధికారులకు తెలియకుండా కిందిస్థాయిలోనే వ్యవహారాన్ని సద్దుమణిచేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. వ్యవహారం బయటకు పొక్కకుండా యానిమేటర్‌కు గడువు ఇప్పించి నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల పొదుపు సొమ్ము స్వాహాలో అధికారుల పాత్ర కూడా ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు..

స్వాహా చేసిన సొమ్ము చెల్లించేందుకు యానిమేటర్‌కు ఇచ్చిన గడువు ముగియడంతో సోమవారం గ్రీవెన్స్‌లో పోలీసు ఉన్నాతాధికారులకు పలువురు గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇటుకలపల్లి పోలీ సులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. గురువారం కూడా ఇద్దరు, ముగ్గురు మహిళలు తమ సొమ్ము స్వాహాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల కిందట మండలంలోని రాచానపల్లిలోను ఇలాంటి సంఘటనే జరిగింది. ఉన్నతాధికారులు పర్యవేక్షించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే చర్చ సాగుతోంది.

స్వాహా నిజమే: రవి, ఏంపీఎం, అనంతపురం రూరల్ మండలం



ఆకుతోటపల్లి గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు సంబంధించి న సొమ్మును గతంలో పని చేసిన యానిమేటర్ తన సొంత ఖాతాలోకి జమ చేసుకున్న విషయం వాస్తవమే. సొమ్ము తన ఖాతాలోకి పడేటట్లు తీర్మానం చేసుకుని, ఆ కాపీని బ్యాంకులో ఇచ్చి, ఆమేరకు తన పరిధిలోని సంఘాల మహిళలకు సంబంధించిన సొమ్మును స్వాహా చేసింది. మా విచారణలో రూ.20లక్షల వరకు యానిమేటర్ గ్రూపు సభ్యులకు తెలియకుండా తీసుకుంది. ఇటీవల మరికొంత మంది తమ సొమ్మును యానిమేటర్ తీసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ లెక్కలు మాదాక రాలేదు. మా దృష్టికి వచ్చిన మేరకు ఆ యానిమేటర్‌తో సొమ్ము రికవరీ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.5లక్షల దాకా చెల్లించారు.

బియ్యం.. బొక్కేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

బఫర్ ఉన్న ఎఫ్‌పీ షాపులు 25 వరకు ఉన్నట్లు సమాచారం. అంటే ఒక్కో దుకాణంలో 4వేల నుంచి 5వేల కిలోల బఫర్ ఉంది. మరికొన్ని ఎఫ్‌పీ షాపుల్లో 20 నుంచి 50 బస్తాల వరకు బఫర్ ఉన్నట్లు చూపుతున్నారు. ఇలా మొత్తం టన్నుల్లో బఫర్ చూపుతోంది. ఇక కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు పరిధిలో ఒక్కోచోట 500 క్వింటాళ్ల నుంచి 1000 క్వింటాళ్ల వరకు బఫర్ ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటును కొందరు డీలర్లు క్యాష్ చేసుకుంటున్నారు. వారందరికీ ఇచ్చేశామని చెప్పి స్థానికులకు ఇవ్వకుండానే లేవని తిప్పి పంపుతున్నారు. పట్టణాలు, మండలకేంద్రాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా సాగుతోంది.

ఆన్‌లైన్‌లో కనిపిస్తుంటే ఏం చేస్తున్నట్లు...?

డీలర్ అంటే అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో వచ్చిన వ్యక్తే. వైసీపీ హయాంలో కొందరు డీలర్లు పీడీఎస్ బియ్యం అమ్ముకుని బఫర్ వచ్చేలా చేశారు. కూటమి పాలనలోనూ కొందరు డీలర్లు అదే వైఖరి అవలంబించారు. కొందరు అమ్మకపోయినా గతంలో చేసిన వారి అక్రమ వ్యాపారంతో బఫర్ ప్రభావం కొనసాగుతోంది. బఫర్ ఎందుకు వస్తుంది, ఎవరెవరు వ్యాపారులకు పీడీఎస్ బియ్యం అమ్ముతున్నారనేది పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలుసు. ఆన్‌లైన్‌లో ఏ షాపులో ఎంత బియ్యం ఉంది..? ఎంత పంపిణీ చేస్తున్నారనేది తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు సీఎస్‌డీటీలకు నెలవారీ ముడుపులు వెళ్తున్నాయనే ఆరోపణలున్నాయి. మరికొందరు డీలర్లు అధికార పార్టీ నేతల పేరు చెప్పుకుని తమ వద్దకు ఎవరూ రాకుండా చూసుకుంటున్నారు.

మేమెట్టా బతకాలి..?

అనంతపురం పరిధిలో బఫర్ ఉన్న డీలర్లను తాజాగా అధికారులు పిలిపించుకున్నారు. ఈసారి బఫర్ లేకుండా బియ్యం సరఫరా చేయాలనే విషయంపై చర్చించారట. అదే క్రమంలో ఇకపై బియ్యం అమ్మడం లాంటివి జరిగితే ఏ6 కేసులు బనాయిస్తామని హెచ్చరించారట. ఈ క్రమంలో ఓ మహిళా డీలర్ 20 బస్తాలు అమ్మినట్లు తేలడంతో అధికారులు మరోసారి ఇలా జరగకూడదని చెప్పారట. దీంతో ఆ డీలర్ 'మాకు వచ్చే 50కిలోల బస్తాలో 43 కిలోలు మాత్రమే బియ్యం ఉంటోంది. మరి మేమెలా బతకాలి. మేమూ డబ్బాలుంచుకోవాలి కదా..' అని ప్రశ్నించడంతో సంబంధిత అధికారులు కిమ్మనకుండా ఉండిపోయారట.

డీలర్లు పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని రేషన్ షాపుల్లో షార్టేజ్(బఫర్)తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. ఎవరైనా రేషన్ డీలర్లు పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవు. కొందరు కేవలం థంబ్ వేసి బియ్యం తీసుకోవడం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. ఆ క్రమంలో తనిఖీలు చేసినప్పుడు చౌకధరల దుకాణంలో బియ్యం తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా విచారిస్తాం. గత కొన్ని నెలల్లో జిల్లా వ్యాప్తంగా 40కుపైగా కేసులు నమోదు చేశాం.

-వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

రాబందులు వచ్చేశాయ్..!

(5వ పేజీ తరువాయి)

భయపెడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు అధికారులు దళారులు తీసుకువచ్చే వివాదాస్పద భూముల రైతులను మరింత భయపెడుతున్నారు. దీంతో అమాయక రైతులు పరిహారం రాదేమోనన్న ఆందోళనతో దళారీలు చెప్పినట్లు వింటున్నారు. రైతులను, తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే ఇద్దరు అధికారులను ఒకచోట కూర్చోబెట్టి పరిహారం అందేవిధంగా చేస్తున్నందుకు లక్షల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం.

సెటిల్‌మెంట్లతో రంగంలోకి..

టేకులోడు సెజ్‌లో భూవివాదాలు లేకపోయినా వారసులు, హక్కుదారులు అంటూ కొత్త వ్యక్తులను తెరపైకి తీసుకుచ్చి కొత్త వివాదాలను సృష్టిస్తున్నారు. భూసమస్య ఉన్నట్లు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇప్పించి పరిహారం అందకుండా నిలుపుదల చేస్తున్నారు. అనంతరం సెటిల్‌మెంట్ల పేరుతో రంగంలోకి దిగుతున్నారు. ఎకరానికి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు కమీషన్ మాట్లాడుకొని భూవివాదాన్ని సెటిల్ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇందులో ఓ ఇద్దరు అధికారుల పాత్ర క్రియాశీలకంగా ఉన్నట్లు పుకార్లు వస్తున్నాయి.

ఆ ఇద్దరిదే కీలకపాత్ర!

వివాదాస్పదంగా ఉన్న భూములను టార్గెట్ చేస్తూ ఆ ఇద్దరు అధికారులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవడానికి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. సామరస్యంగా పరిష్కారమయ్యే భూసమస్యలను పెద్దవిగా చేస్తూ రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకునేలా చేస్తున్నారు. అన్నదమ్ములు, వారసులు, ఒకరు పట్టాదారుడుగా ఉంటూ సాగులో వేరే వ్యక్తి ఉండటం, నిజమైన హక్కుదారుడైనా రికార్డులో అపరిష్కృత భూమిగా ఉండటం వంటి విషయాలను గుర్తించి వారి నుంచి పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాదు కూడదు అంటే రికార్డులు మాచేతుల్లో ఉంటాయి. పరిహారం అందకుండా చేయగలం అనే మాట చెప్తున్నట్లు తెలుస్తోంది. దీంతో విధిలేక ఆ ఇద్దరు చెప్పిన మాటకి సరే అని డీల్‌కి ఒప్పుకుంటున్నారు.

రూ. లక్షల్లో డిమాండ్

వివాదాస్పదంగా ఉన్న భూ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు ఒక్కో రైతు నుంచి ఎకరానికి రూ. లక్ష వరకు దళారులు ఆ ఇద్దరు అధికారులను కలుపుకొని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. పరిహార నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అవుతుండటంతో ఆ ఇద్దరి అధికారులకు ఇచ్చే వాటాకి దళారులే మధ్యవర్తిగా ఉంటున్నట్లు సమాచారం. ఇప్పటికే 600 ఎకరాల భూసేకరణలో 60 మంది రైతుల భూములు వివిధ కారణాలతో వివాదాస్పదంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రోజూ ఏదో ఒక కారణంతో అర్జీలు వస్తున్నట్లు చెప్తున్నారు. ఇలా అర్జీలు వచ్చిన భూములకు పరిహారం ఇవ్వడానికి బ్రేక్ పడుతోంది. ఆందోళనతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు సెటిల్‌మెంట్ చేసి పరిహారాన్ని పంచుకుంటున్నట్లు సమాచారం.

దళారులను నమ్మొద్దు: ఆనంద్‌కుమార్, పెనుకొండ ఆర్డీఓ



టేకులోడు సెజ్ భూముల పరిహారం పొందే విషయంలో ఎవరు దళారులను ఆశ్రయించవద్దు. సమస్య ఏదైనా ఉంటే మా వద్దకు తీసుకురావాలి. దళారులు చెప్పే మాటలు నమ్మి వారికి డబ్బులు ఇచ్చే పని చేయవద్దు. దళారులు చెప్పినవిధంగా ప్రభుత్వ అధికారులు ఎవరూ వినరు. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలి. దళారులకు వెన్ను దన్నుగా కార్యాలయ సిబ్బంది ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదు. రైతులకు అందజేసే పరిహారం విషయంలో దళారులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పక ఉంటాయి. రైతులు నేరుగా తహసీల్దార్‌కి కానీ, పెనుకొండలో నాకు కానీ సమస్య తెలుపుకోవచ్చు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొని న్యాయం చేస్తాం.

స్థానికతను తెలిపితేనే సార్థకత

● విశ్రాంత ఇంజనీరు శంకర్‌నారాయణ

● మనమెరుగని లాటిన్ అమెరికా ఆవిష్కరణ



ప్రసంగిస్తున్న శంకర్‌నారాయణ

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవన పరిస్థితులను తెలుసుకునేలా యాత్రలు ఉండాలని బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డివిజనల్ ఇంజనీరు శంకర్‌నారాయణ అన్నారు. దాసరి అమరేంద్ర తెలుగులోకి అనువదించిన 'మనమెరుగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభను గురువారం సాయంత్రం ఎన్జీఓ హోంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో దాసరి అమరేంద్ర ప్రసంగించారు. స్థానిక సంస్కృతితో సంపర్కం చెందకుండా చేసే యాత్రలు నిష్ఫలమని అన్నారు. డాక్టర్ శేషగిరి లాటిన్ అమెరికా దేశాలలోని ప్రజలతో మమేకమై, అక్కడి సంస్కృతి, జీవన విధానాలను పుస్తకరూపంలోకి తీసుకువచ్చారని అన్నారు. ఆ పుస్తకాన్ని దాసరి అమరేంద్ర 'మనమెరుగని లాటిన్ అమెరికా' పేరుతో ఇక్కడి వారికి అర్థమయ్యేలా తెలుగులో అనువదించడం అభినందనీయమని అన్నారు. ఆయా దేశాల్లో జన సాంస్కృతిక వైరుధ్యాలను అర్థం చేసుకున్న రచయిత ఆలోచనలను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని అన్నారు. నేటివ్ అమెరికన్లు ఈ దేశాల ప్రజలేనని, వారి ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను డాక్టర్ శేషగిరి పాఠకులకు పరిచయం చేశారని అన్నారు. అమరేంద్ర అంతే సమర్థవంతంగా తెలుగీకరించారని అభినందించారు. కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ప్రతినిధి ఏజీ రాజమోహన్, మానవహక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, చంద్రశేఖర్, డాక్టర్ ప్రసూన, రచయితలు రాజారామ్, తరిమెల అమర్నాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, ఉప్పరపాటి వెంకటేశులు, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, టీవీ రెడ్డి, సత్యబోస్, గోవిందరాజులు, అనంత మాలతి తదితరులు పాల్గొన్నారు.

గడేకల్లులో గజదొంగలు

● పనులు చేయకుండానే బిల్లులు డ్రా ● రూ.18 లక్షలు స్వాహా

● వైసీపీ, టీడీపీ నాయకుల కుమ్మక్కు ● సోషల్ మీడియాలో వైరల్

విడపనకల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో గజదొంగలు పడ్డారు. ఒక్క పని చేయకుండానే రూ.18 లక్షలు డ్రా చేసుకుని పంచుకు తిన్నారు. ఈ అక్రమాల వ్యవహారం కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో సంచలనమైంది. వారం రోజులుగా హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో కొంతమంది టీడీపీ నాయకులు.. వైసీపీ వారితో కుమ్మక్కయ్యారు. నీకు ఇంత.. నాకు ఇంత.. అని పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసుకు తిన్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గడేకల్లు సర్పంచ్ వైసీపీ మద్దతుదారుడు కావడంతో గ్రామం పరిధిలో ఎలాంటి బిల్లు కావాలన్నా... సర్పంచ్ సంతకం తప్పనిసరి. దీంతో టీడీపీ నాయకులు.. వైసీపీ వారితో కుమ్మక్కయ్యారు. పనులు చేయకుండానే బిల్లులు మింగేశారు. విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొన్నిరోజుల క్రితం పంచాయతీ రికార్డులను బయటకు తీసి పరిశీలించారు. ఎక్కడెక్కడ పనులు చేశారు, వాటి వివరాలు బిల్లులు సహా బయట పెట్టారు. ఒక్క పని కూడా చేయలేదని తెలిసి గడేకల్లు గ్రామ సచివాలయానికి చేరుకున్నారు. పనులు చేయకుండానే బిల్లులు ఎలా పెట్టారని అధికారులను నిలదీశారు. బిల్లులు పెట్టిన ప్రకారం పనులు ఎక్కడ చేయించారో చూపించాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. గడేకల్లు గ్రామంలో మరుగుదొడ్లు కట్టినట్లు రికార్డులు చేశారు. గ్రామంలో ఎక్కడా అలాంటివి నిర్మించలేదు. అయినా బిల్లులు మాత్రం లక్షల్లోనే డ్రా చేశారు. నీటి శుద్ధికి ఏకంగా రూ.4లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డులు చేశారు. ఒక్క పని కూడా చేయలేదని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.





సోషల్ మీడియాలో అక్రమ బిల్లులు

బిల్లులో అలా నమోదు చేసినా..

పంచాయతీలో డబ్బులు తక్కువగా ఉంటే పీఎఫ్ఎంఎస్ నిధులను వినియోగించుకోవచ్చు. బిల్లులో ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి, తాగునీటి కోసం నమోదు చేసినా.. అ నిధులను గ్రామంలో చేసిన ఇతర పనులకు వాడుకోవచ్చు. మరుగుదొడ్డే నిర్మించకపోయినా వాటి నిర్వహణకు అని చెప్పి బిల్లులు డ్రా చేసుకోవచ్చు.

-సత్యబాబు, ఈఓఆర్డీ

డ్రా చేసుకున్న బిల్లులు

● గతేడాది సెప్టెంబరు 6న రూ.97,500

● అక్టోబరు 29న రూ.57,230, రూ.40,270, అక్టోబరు 30న రూ.15,730, నవంబరు 20న రూ.1,96,316

● ఈ ఏడాది జనవరి 28న మేకల భీమేష్ పేరున రూ.1.33 లక్షలు, జనవరి 29న కర్రెన్నగారి రాముడి పేరున మరుగుదొడ్డి నిర్మించినట్లు రూ.78,560, జనవరి 30న కర్రెన్నగారి రాముడి పేరున నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు రూ.24,210, వైసీపీకి చెందిన గడేకల్లు సర్పంచ్ సుశీల భర్త ఉమా శంకర్ పేరున నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.4.26 లక్షలు

● ఫిబ్రవరి 6న కురుబ రామాంజనేయులు పేరున రూ.48,380

● ఏప్రిల్ 8న ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.63 లక్షలు, మొండ్ల శివశంకర్ పేరున డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌కు రూ.97,500, టీడీపీ నాయకుడు ముద్దూరి శ్రీనివాసులు పేరున నాలుగు బిల్లులు పెట్టారు. ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1,10,035, ఇతర పనులకు రూ.1,82,524, రూ.68,843, రూ.87,313 బిల్లులు డ్రా చేశారు.

53 డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

31 వరకూ స్పెషల్ డ్రైవ్: ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడపడం, ఆరుబయట మద్యం తాగే వారిని కట్టడి చేయడంపై స్పెషల్ డ్రైవ్ పెట్టినట్లు ఎస్పీ జగదీష్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై స్పెషల్ డ్రైవ్ జరుగుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా సీఐలు, ఎస్‌ఐలు రహదారులపై వాహన తనిఖీలు చేస్తున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిఘా పెట్టామన్నారు. ఆటోలు, టూవీలర్లు, కార్లు, లారీలు, ఇతర వాహనాలను ఆపి బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే డ్రంకెన్ డ్రైవ్‌పై 53, ఓపెన్ డ్రింకింగ్‌పై 93 కేసులు నమోదు చేశామన్నారు. ఈనెల 10 వరకూ డ్రంకెన్ డ్రైవ్, 11 నుంచి 17వ తేదీ వరకూ అతివేగం, 18 నుంచి 24వతేదీ వరకూ హెల్మెట్ వినియోగం, 25 నుంచి 31వతేదీ వరకూ ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు.

13న రామగిరి ఎంపీపీ ఎన్నిక

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 13న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ స్థానం జనరల్ మహిళకు రిజర్వేషన్ అయింది. ఇప్పటి వరకు మూడుసార్లు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం నాలుగోసారి నోటిఫికేషన్ విడుదలైంది. ఎంపీపీ ఉప ఎన్నికకు ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని నోటీసులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు



పతకాలు సాధించిన విద్యార్థులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితంలో క్రీడలు భాగం కావాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. గురువారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ ఆచార్య సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి కళాశాలలో క్రీడాపోటీలు నిర్వహించడానికి అవసరమైన సాయాన్ని విశ్వవిద్యాలయం అందిస్తుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో యోగాకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి ఫిజికల్ డైరెక్టర్ యోగా నేర్చుకుని, విద్యార్థులకు బోధించాలన్నారు. 2024-25లో 200మంది క్రీడాకారులు సౌత్ జోన్, ఆల్ ఇండియా స్థాయిలో పాల్గొని సర్టిఫికేట్లు పొందడం సంతోషంగా ఉందన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఆచార్య నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు 233 మంది ఎంపిక



జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైన వారు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి క్రీడాపోటలకు 233 మంది ఎంపికయ్యారు. ఆగస్టు 29న స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని మూడు రోజులుగా జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఆయా క్రీడాంశాల్లో ఎంపికైన వారి వివరాలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ ప్రకటించారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. కబడ్డీ, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్, ఖో-ఖో, ఆర్చరీ, హాకీ విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. వీరు తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 9849421462, 08554-353223 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచాలి: డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో అడ్మిషన్లు పెంచేలా బోధన ఉండాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. 9 జిల్లాల కేజీబీవీల్లో పనిచేస్తున్న హిందీ, ఉర్దూ టీచర్లకు ఐదు రోజులుగా స్థానిక శ్రీభారతి బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. శిక్షణలో తెలుసుకున్న అంశాలను బోధనలో వినియోగించాలన్నారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలనీ, అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కేజీబీవీల్లో పనిచేస్తున్న 192 మంది హిందీ, ఉర్దూ టీచర్లు శిక్షణకు హాజరయ్యారని జీసీడీఓ కవిత తెలిపారు. అనంతరం ఆర్‌పీలకు సర్టిఫికెట్లు అందజేశారు.



అన్నదాత ఎదురుచూపు

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము జమలో జాప్యం
కొందరికి ఒక్కటే పడిన వైనం
రైతు సేవాకేంద్రాలకు రైతుల పరుగు

రాప్తాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం జిల్లాలో పలువురు రైతులకు ఎదురుచూపులు తప్పట్లేదు. కొందరికి ఒక పథకం సొమ్ము మాత్రమే జమైంది. మరొక పథకం సొమ్ము పడక ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతు సేవాకేంద్రాలకు వెళ్లి, సిబ్బందితో ఆరాతీస్తున్నారు.

ఒక్కటే జమ..

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రైతుకు రూ.2వేలు జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతు ఖాతాలకు రూ.5 వేలు చొప్పున జమ చేస్తోంది. ఈనెల 2వ తేదీన పథకాలకు శ్రీకారం చుట్టారు. మండలంలో 8,894 మంది రైతులకు రూ.6.22 కోట్లు జమ కావాల్సి ఉంది. కొందరు అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు పూర్తిస్థాయిలో జమకాలేదు. రూ.2 వేలు ఖాతాలో జమ అయిన వారికి.. రూ.5 వేలు జమ కాలేదు. రూ.5 వేలు జమ అయిన రైతులకు రూ.2 వేలు పడలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి 4 రోజులు గడిచింది. అయినా కొందరు రైతులకు పూర్తిగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమ కాలేదు. దీంతో రైతు సేవాకేంద్రాల వద్దకు అన్నదాతలు పరుగులు తీస్తున్నారు. డబ్బు ఖాతాలో జమ అవుతుందో.. లేదో.. అని కొందరు ఆవేదన చెందుతున్నారు. 'మీ సమస్య-మా బాధ్యత' పేరుతో టీడీపీ నాయకులు గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ డబ్బు జమకాని రైతులు అర్జీలు అందజేస్తున్నారు.

పీఎం కిసాన్ డబ్బు జమ కాలేదు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 2న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి అన్నదాత సుఖీభవ డబ్బు ఖాతాలో జమ అయింది. పీఎం కిసాన్ సొమ్ము రూ.2 వేలు పడలేదు.

-వెంకటరాముడు, రైతు, హంపాపురం

జాబితాలో పేరు ఉందట



ఈనెల 2న అన్నదాత సుఖీభవ డబ్బు రూ.5 వేలు బ్యాంకు ఖాతాలో జమైంది. పీఎం కిసాన్ సొమ్ము రూ.2వేలు పడలేదు. రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించగా.. అర్హులైన రైతుల జాబితాలో పేరు ఉందని డబ్బు జమవుతుందని తెలిపారు.

-కళావతి, మహిళారైతు, హంపాపురం

అన్నదాత సుఖీభవ డబ్బు పడలేదు



మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి పీఎం కిసాన్ డబ్బు రూ.2 వేలు ఈనెల 2వ తేదీ బ్యాంకు ఖాతాలో జమైంది. అన్నదాత సుఖీభవ డబ్బు రూ.5 వేలు పడలేదు. అర్హుల జాబితాలో పేరున్నా.. ఇంకా డబ్బు జమ కాలేదు.

-రామాంజనేయులు, రైతు, హంపాపురం

వారం, పదిరోజుల్లో అందరికీ జమవుతాయి



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు ఇప్పటికే చాలామంది రైతుల ఖాతాల్లో జమయ్యాయి. కొందరికి రూ.2వేలు, మరికొందరికి రూ.5వేలు జమ కావాల్సి ఉంది. అర్హులైన రైతులకు తప్పనిసరిగా వారం, పది రోజుల్లో జమవుతాయి.

-కృష్ణచైతన్య, ఏఓ, రాప్తాడు

గర్భిణి ఆత్మహత్య కేసులో వీఆర్వో అరెస్ట్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న షేక్ షమీమ్‌బాను కేసులో వీఆర్వో మహమ్మద్‌వలిని వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను సీఐ మనోహర్ వెల్లడించారు. పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌లో నివాసముంటున్న షేక్ పీర్‌బాషా పెద్ద కుమార్తె షేక్ షమీమ్ బానుకు ఆరేళ్ల కిందట రాయచూర్‌కు చెందిన షామీర్ హుసేన్‌తో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. విభేదాల నేపథ్యంలో భర్తతో విడాకులు తీసుకున్న షమీమ్ బాను తన కొడుకుతో కలిసి తల్లిదండ్రుల వద్దే ఉండేది. 2023లో రేషన్ కార్డులో తన కుమారుడి పేరు చేర్పించడానికి భాగ్యనగర్‌లోని సచివాలయానికి షమీమ్ బాను వెళ్లారు. అక్కడ వీఆర్వోగా పనిచేస్తున్న మహమ్మద్ వలితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో ఆమెకు మాయ మాటలు చెప్పి, 2024లో పెళ్లి చేసుకుని వేరే కాపురం పెట్టాడు. షమీమ్‌బాను వద్ద ఉన్న రెండు లక్షల విలువచేసే బంగారం నగలను కూడా మహమ్మద్ వలి తీసుకుని తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బు వాడుకున్నాడు.

షమీమ్‌బానుతో పెళ్లి, వేరు కాపురం విషయం మహమ్మద్ వలి మొదటి భార్య నూర్జహాన్‌కు తెలిసింది. దీంతో ఆమె వెళ్లి షమీమ్‌బానుతో గొడవ పడింది. దీంతో మహమ్మద్ వలి, అతడి మొదటి భార్య నూర్జహాన్, ఆమె కుటుంబ సభ్యులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో షమీమ్‌బాను కేసు పెట్టింది. తర్వాత కొద్ది రోజులకు తాను గర్భవతిని అని, గోల్డ్‌లోన్ కట్టడానికి కష్టంగా ఉందని, పెట్టిన కేసు వెనక్కి తీసుకుంటానని, తనను కాపురానికి తీసుకొని వెళ్లాలని మహమ్మద్ వలిని బతిమాలింది. అతడు మాత్రం నువ్వంటే నాకు ఇష్టం లేదు, నువ్వు నాకు వద్దు, ఎక్కడైనా చచ్చిపో అంటూ కటువుగా మాట్లాడాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి షేక్ పీర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం వీఆర్వో మహమ్మద్ వలిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

బంగారం చోరీ

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఓ మహిళ బ్యాగ్ నుంచి పది తులాల బంగారం మాయమైంది. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మండలం పరశురాంపురం గ్రామానికి జ్యోతి అనే మహిళ గురువారం బయలుదేరింది. కళ్యాణదుర్గం బస్టాండ్‌లో దిగి, పరశురాంపురం వెళ్లే బస్సు ఎక్కింది. దాహం వేయడంతో వాటర్ బాటిల్ కోసం బ్యాగ్ తీసింది. ఆ సమయంలో బంగారం కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కొత్తచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన కిత్తెర నారాయణస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని అప్‌గ్రేడ్ సీఐ మారుతీ శంకర్ గురువారం తెలిపారు. లోచర్లకు చెందిన దామోదర్, లక్ష్మయ్య, కిత్తెర నారాయణస్వామి బుధవారం రాత్రి మద్యం సేవించి, గొడవ పడ్డారని తెలిపారు. మద్యం మత్తులో నారాయణస్వామి కులం పేరుతో దూషించారని, తమపై దాడి చేశారని దామోదర్, లక్ష్మయ్య ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

కారు అద్దె ఇవ్వలేదని..

కడపకు చెందిన వెంకట శశిధర్ రెడ్డి తన కారును అద్దెకు తీసుకుని మోసగించాడని కొత్తచెరువు మండలం తిప్పాబట్లపల్లికి చెందిన గడపర్తి హరీష్ ఫిర్యాదు చేశారని సీఐ మారుతీ శంకర్ తెలిపారు. ఇన్నోవా కారును నెలకు రూ.27 వేల ప్రకారం అద్దెకు ఇచ్చానని, రూ.3 లక్షల అద్దె ఇవ్వాల్సి ఉందని, కారును కూడా ఇవ్వడం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు.

మెట్లపై నుంచి జారిపడి మృతి

నల్లమాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్. ఎనుములవారిపల్లి గ్రామానికి చెందిన కొట్టాల భాస్కర్(47) తన ఇంటి మెట్లపై నుంచి జారిపడి మృతిచెందాడు. ప్రమాదంపై మృతుని తమ్ముడి కుమారుడు వంశీ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈనెల 3వతేదీ మిద్దెపైకి ఎక్కుతు జారిపడ్డాడని, తీవ్ర గాయాలతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. భాస్కర్‌కు భార్య మహేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు.

అసభ్య పోస్టులపై కేసు నమోదు

గాండ్లపెంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ యువతికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినవారిపై కేసు నమోదు చేశామని జమేదార్ గంగాధర్ గురువారం తెలిపారు. యువతి ఫొటోను మార్ఫింగ్ చేసి, అసభ్యంగా మార్చి సోషల్ మీడియాలో పెట్టారని ఆయన తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడి ఆత్మహత్య

కుటుంబ కలహాలు, అప్పులతోనే..



రామాంజనేయులు (ఫైల్)

పెనుకొండ రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, అప్పుల బాధ భరించలేక విషపు గుళికలు మింగిన మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ముత్యాల చెరువు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు రామాంజనేయులు (58) చికిత్స పొందుతూ గురువారం మరణించారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాంజనేయులు ఐదెకరాల భూమి కౌలుకు తీసుకుని, అందులో వివిధ పంటలు సాగుచేస్తుండేవాడు. పంటలు దెబ్బతిని నష్టపోయాడు. రూ.50 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీనికితోడు కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. వీటితో మనస్తాపం చెంది గతనెల 30న విషపు గుళికల మింగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రామాంజనేయులుకు భార్య నాగమ్మ, కుమారుడు మల్లికార్జున ఉన్నారు.

చిత్రావతి సుందరీకరణకు శ్రీకారం

పనులకు జోయాలుక్కాస్ రూ.1.2 కోట్ల విరాళం



చెక్కును అందచేస్తున్న జోయాలుక్కాస్ ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని పుట్టపర్తిలో చిత్రావతి నది సుందరీకరణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ట్రస్టు సభ్యుడు ఆర్‌జె రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పనులకు ప్రారంభోత్సవం చేశారు. జోయాలుక్కాస్ సంస్థ విరాళంగా అందించిన రూ.1.2కోట్లతో ఈ పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి శతజయంతి ఉత్సవాల నిర్వాహణకు జోయాలుక్కాస్ సంస్థ భారీ విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈనిధులతో చిత్రావతి నది తీర ప్రాంతంలో పార్కు, జిమ్, ప్రహరీలు నిర్మిస్తామన్నారు. జేసీ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా శతజయంతిని ఘనంగా నిర్వహించడానికి పుట్టపర్తిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జోయాలుక్కాస్ సంస్థ బాటలో మిగిలిన వారు కూడా సుందరీకరణ పనులకు విరాళాలు అందించాలని కోరారు. మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిత్రావతి ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు జోయాలుక్కాస్ సంస్థ ప్రతినిధులు మ్యాంగ్‌ధ్యూ, గణేష్, రూ.1.2 కోట్ల చెక్కును సత్యసాయిబాబా సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు, ఎమ్మెల్యే, జేసీ, మాజీ మంత్రికి అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌రాజు, ఏఈ జానకీబాయి, టీడీపీ నాయకులు పీసీ గంగన్న, సామకోటి ఆదినారాయణ, గంగాధర్‌నాయుడు పాల్గొన్నారు.

గంటల్లోనే చోరీ కేసు ఛేదింపు

ఇద్దరు నిందితుల అరెస్టు
రూ.3.3 లక్షలు, 5.8 తులాల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం చూపిస్తున్న డీఎస్పీ వెంకటేశులు, సీఐ

బుక్కరాయసముద్రం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించి, ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బుక్కరాయసముద్రం చేపలకాలనీకి చెందిన ఒంటరి మహిళ పాముల తిప్పక్క అనంతపురం మార్కెట్‌లో ఆకుకూరలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఈక్రమంలోనే బుధవారం వేకువజామునే మార్కెట్‌కు వెళ్లింది. దీన్ని గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న రూ.3.3లక్షలు, 5.8తులాల బంగారం ఆభరణాలు చోరీ చేశారు. మార్కెట్ నుంచి వచ్చిన తిప్పక్కకు ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండటం కనిపించింది. బీరువాలో ఉన్న నగదు, బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన చెల్లెలు కుమారులు ఇంద్రసేనారెడ్డి, శశికుమార్‌రెడ్డిపై అనుమానం వ్యక్తం చేసింది. స్థానిక మునలమ్మ గుడి సమీపంలో ఉన్న వారిద్దరిని పట్టుకుని సీఐ పుల్లయ్య, ఎస్ఐ రామప్రసాద్, పీఎస్ఐ కళ్యాణ్, పోలీసు సిబ్బంది తమదైన శైలిలో విచారించారు. నేరం అంగీకరించడంతో వారి వద్ద ఉన్న రూ.3.3లక్షలు, 5.8 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. చోరీ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

గుంతకల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లకు వెయిటింగ్ లిస్టు ప్రయాణికుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లను జత చేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం -ధర్మవరం (వయా తాడిపత్రి, గుత్తి, అనంతపురం) ఎక్స్‌ప్రెస్ (17215) రైలుకు ఈ నెల 10 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (17216)కు ఈ నెల 11 నుంచి ఒక ఏసీ టూటైర్ కోచ్‌ను జత చేయనున్నట్లు తెలిపారు. తిరుపతి-హుబ్లీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (57401) రైలుకు ఈనెల 13 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (57402)కు ఈ నెల 14 నుంచి, తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు (57403) రైలుకు ఈనెల 13 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలుకు (57404) ఈనెల 14 నుంచి, తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (57405) రైలుకు ఈ నెల 15 నుంచిచీ, దీని తిరుగు ప్రయాణపు రైలు (57406)కు ఈ నెల 16 నుంచి రెండు స్లీపర్‌క్లాస్ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జోడించి నడపనున్నట్లు వెల్లడించారు.

ప్రతి బస్సును కండిషన్‌లో ఉంచాలి


సిబ్బందికి ఆర్టీసీ ఈడీ ఆదేశాలు



అనంతపురం డిపో గ్యారేజీలో పరిశీలిస్తున్న ఈడీ చంద్రశేఖర్

అనంతపురం టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రీజియన్‌లో ప్రతి బస్సును కండిషన్‌లో ఉంచాలని ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్.. సిబ్బందికి సూచించారు. గురువారం అనంతపురం డిపోతోపాటు బస్టాండు పరిసరాలను ఆయన పరిశీలించారు. బస్సుల సామర్థ్యం, గ్యారేజీలో చేపడుతున్న పనులపై అధికారులతో ఆరాతీశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం బస్సుల వినియోగం ఎక్కువగా ఉంటుందనానరు. ఆ మేరకు సరిపడా బస్సులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. టిమ్‌లు, స్పేర్ పార్ట్స్ అవసరమైనన్ని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బస్టాండు పరిసరాలు, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతపురం డిపో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం రూపొందించిన నమూనాను అధికారులు.. ఈడీకి చూపించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అనంతపురం ఇన్‌చార్జి ఆర్ఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ చంద్రాయుడు, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేవీఎన్ మూర్తి, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీపీగా తిరుపతినాయుడు



అనంతపురం క్రైం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): జిల్లా గవర్నమెంట్ ప్లీడర్‌గా అడ్వకేట్ తిరుపతినాయుడు నియమితుడయ్యారు. ఈ మేరకు గురువారం జీవో 274 జారీ అయింది. నార్పల మండలం వెంకటంపల్లికి చెందిన తిరుపతి నాయుడు 1989లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. 1996 నుంచి 1998 వరకూ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహించారు. 2002 నుంచి 2006 వరకూ అనంతపురం జిల్లా 6వ అదనపు కోర్టులో అడిషనల్ పీపీగా పనిచేశారు. ఫ్యామిలీ కోర్టు (7వ అదనపు జిల్లా కోర్టు) అడిషనల్ పీపీగా 2016 నుంచి 2019 వరకూ ఒకసారి, 2019 నుంచి రెండోసారి పనిచేశారు. జీపీగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి మూడేళ్ల పాటు ఆయన ఆ పోస్టులో కొనసాగుతారు. ప్రభుత్వం తరఫున ఆయన సివిల్ కేసులు చూస్తారు. జీపీగా సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆయనకు నెలకు రూ.30 వేలు గౌరవ వేతనం అందిస్తుంది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥7382114647

AJA- 237940

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (పీజీఓథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ 9030661651.

AJA- 237938

అకౌంటెంట్ కావలెను

TallyPrime Accounts, M.S ఆఫీస్ నందు అనుభవం గల అకౌంటెంట్ కావలెను. జీతం:15,000 నుంచి 20,000 కలదు. శ్రీ శబరి ఆయిల్ ట్రేడర్స్, పాతవూరు,అనంతపురం. సెల్ : 9705340666.

AJA- 237939

WANTED

మహేంద్ర జనరేటర్స్ కంపెనీ యందు సర్వీస్‌ఇంజనీర్స్ కావలెను. అర్హత: ITI, Diploma సెలెక్ట్ అయిన వారికి కంపెనీ యందు ట్రైనింగ్ ఇవ్వబడును. టెలి కాలర్స్ కావలెను. GM Engineering Corporation. Anantapuramu, Cell:9908162069

AJA- 237941

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

సామూహిక ఒడి బియ్యం



సామూహిక ఒడి బియ్యం సమర్పిస్తున్న నిర్వాహకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని షిర్డి సాయి అన్నదాన సేవాసమితి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ ఎదురుగా ఉన్న గీతామందిర్‌లో సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా 116 మంది పేద మహిళలకు శాస్త్రబద్ధంగా ఒడిబియ్యం పోసారు. కార్యక్రమంలో చెక్రా సుబ్రహ్మణ్యం, పరుచూరి జగన్నాథ్, మురారి సదాశివగుప్త తదితరులు పాల్గొన్నారు.

శివబాలయోగి ఆశ్రమంలో పూజలు



స్వామివారి పాదుకలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శివబాలయోగి మహరాజ్ స్వామి తపస్సు సిద్ధించిన రోజును పురస్కరించుకుని గురువారం శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు చేయడంతోపాటు విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు చేపట్టారు. భక్తుల చేతులమీదుగా స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అలయ ఆవరణలో స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు, భాను, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బీసీలకు 56శాతం రిజర్వేషన్లు కల్పించాలి



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జనాభా దామాషా ప్రకారం బీసీలకు 56శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బీపీ మండల్ కమిషన్ డే సందర్భంగా గురువారం స్థానిక ఏపీ స్టూడెంట్ జేఏసీ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్ల రూపకర్త బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు మండల్ అని, 7న మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన రోజు అని గుర్తుచేశారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థ, ఎస్‌వీఎఫ్ఎస్ అధ్యక్షుడు చక్రధర్, అమర్ యాదవ్, రామలింగ, పార్థు, శివ, నరేష్, రాము పాల్గొన్నారు.

బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆహ్వాన సంఘం నేతలు

అనంతపురం టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభల బ్రోచర్లను గురువారం లలితకళా పరిషత్ ఆవరణలో ఆవిష్కరించారు. ఐద్వా కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది మహిళా ఉద్యమనేతలు హాజరవుతున్నారన్నారు. మూడు సంవత్సరాలుగా ఐద్వా చేసిన కృషి ని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణను సభల్లో తీర్మానిస్తామన్నారు. ఐద్వా అఖిలభారత అధ్యక్ష కార్యదర్శులు మరియం దావలె, పుణ్యవతిలతోపాటు రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలు మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ అరుణ, పద్మజ, డాక్టర్ బాలకుమారి, డాక్టర్ ప్రసూన, రమాదేవి, శ్యామల, చంద్రిక, అశ్విని పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వాల్మీకి బోయసంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. ఏపీ వాల్మీకిబోయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని పార్లమెంట్, ఏపీ భవన్‌లతో పాటు వివిధ కార్యాలయాలలో ఇండియా బ్లాక్ నాయకులను కలిసి మద్దతు కూడగట్టారు. క్రాంతి నాయుడు మాట్లాడుతూ రాజ్యాంగ ఉల్లంఘన జరిగిన అంశంపై పార్లమెంట్‌లో గళం వినిపించాలని ఇండియా బ్లాక్ ఎంపీలను కోరామన్నారు. నాయకులు అర్జున్, మాధవయ్య, ఆదినారాయణ, రామలింగయ్య, మద్దిలేటి, వీరేష్ పాల్గొన్నారు.

ఫీజు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

అనంతపురంరూరల్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావును కలసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ..ఇంజనీరింగ్ ఫీజులు రూ.10వేల నుంచి రూ.45వేలకు పెంచడం సరికాదన్నారు.యూనివర్సిటీ ఇన్‌చార్జి గణేష్, విజయ్, దివాకర్, హితేష్, విష్ణు పాల్గొన్నారు.

సివిల్ విద్యార్థులకు ప్లేస్మెంట్లు



ఎంపికైన విద్యార్థులతో విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్

అనంతపురం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాటర్‌ప్రూఫింగ్ సేవల సంస్థ శ్రీసాయి రక్షా ఎంటర్‌ప్రైజెస్ ఉద్యోగాలకు పీవీకేకేఐటీ సివిల్ విద్యార్థులకు ప్లేస్మెంట్లు దక్కాయి. గురువారం పీవీకేకే కళాశాలలో హైదరాబాదుకు చెందిన వాటర్ ప్రూఫింగ్ సేవల సంస్థ, స్కైస్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలకు చెందిన షౌకత్ అలీ, బాలాజీ, విశ్వాస్ అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి అభినందించారు. మేనేజర్ సుమన్‌రెడ్డి, ఏఓ మనోహర్‌రెడ్డి, సివిల్ విభాగాధిపతి రాజేష్, అధ్యాపకుడు ఫయాజ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో వణుకుతున్న ప్రజలు

తాండవిస్తున్న అపరిశుభ్రత
పట్టించుకోని పంచాయతీ అధికారులు

శింగనమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో గ్రామీణ ప్రజలు అల్లాడిపోతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని పెద్దమట్లగొంది గ్రామంలో కొన్ని రోజులు క్రితం చలివిడి తిని 30 మంది వాతులు విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. గురువారం అదే గ్రామానికి చెందిన కంబగిరి రాముడు, లక్ష్మీదేవి, సూరి, పక్కీరమ్మ, నారాయణస్వామితోపాటు మరో ఆరుగురు వాంతులు, విరేచనాలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఇక్కడ నీరు, అపరిశుభ్రత వల్లనే వాంతులు, విరేచనాలతో ప్రజలు బాధపడుతున్నారని తెలిసింది. అధికారులు మాత్రం నీటి వల్లన కాదని తేల్చిచెప్పారు. పోతురాజు కాలవ, గురుగుంట్ల, నాగులగుండం తండా గ్రామాల నుంచి విరేచనాలతో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నట్లు తెలిసింది.



కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అతిసారతో చికిత్స పొందుతున్న బాధితులు

రైతులకు మెరుగైన సేవలను అందించండి

● ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్/క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురంరూరల్ మండల రాచానపల్లి, చియ్యేడు, ఆత్మకూరు మండలం ముట్టాల సంఘాలకు సంబంధించిన నూతన కమిటీ ఎంపిక జరిగిన విషయం విదితమే. ఆమేరకు గురువారం సాయంత్రం రాచానపల్లి సొసైటీ అధ్యక్షుడు పాములాయి రఘు, సభ్యులు చిన్నంపల్లి శ్రీనివాసులు, కొడిమి బండినారాయణ, చియ్యేడు సొసైటీ అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ, సభ్యులు ఆకుతోటపల్లి శ్రీరాములు, పూలకుంట సుధాకర్‌రెడ్డి, ముట్టాల సొసైటీ అధ్యక్షులు ముట్టాల బోయ గంతి లింగన్న, సభ్యులు సిద్ధరాంపురం నారాయణప్ప, మదిగుబ్బ బోయ బొమ్మయ్య ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశారు. గజమాల, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆమె మాట్లాడుతూ..రైతులకు మేలు చేసే విధంగా మీకు మంచి పదవులు వచ్చాయన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న రాచానపల్లి, చియ్యేడు సొసైటీల సింగిల్ విండో అధ్యక్షులు

చేనేతల శ్రమ.. జాతీయ సంపద: బీజేపీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతల శ్రమ దేశ జాతీయ సంపద అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న ఆప్కో చేనేత కార్యాలయంలో చేనేత వస్త్రం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చేనేత దినోత్సవం ఒక జ్ఞాపకం కాదని...శ్రమజీవుల గౌరవానికి చిహ్నమని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో బీసీల కళాప్రతిభకు దేశ ఆత్మకి దర్పణం వేసే రోజు అని, చేనేత స్వాలంబన స్వాతంత్ర్యమూలాలను గుర్తుచేస్తోందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాగేంద్రకుమార్, నాయకులు శాంతకుమార్, రంజిత్‌కుమార్, శ్రీనివాసులు, చలపతి, మల్లోబులు, నాగరాజు, అయ్యన్న, గణేష్, హరీష్, ప్రవీణ్, సురేంద్ర, ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

అనంతపురంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని ఆత్మ పీడీ పద్మలత సూచించారు. గురువారం మండలంలోని తాటిచెర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ వెంకటకుమార్ అధ్యక్షతన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మాట్లాడుతూ ట్రైకోడెర్మావిరిడిని అన్ని వ్యవసాయ, ఉద్యాన పంటల్లో వాడుకోవాలన్నారు. ఏఈఓలు మల్లికార్జున, అలేఖ్య, ఉద్యాన సహాయకులు గంపరాజు, రైతులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి

అనంతపురంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు అందించాలని ఎంపీడీఓ దివాకర్ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 12 నుంచి 20వ తేదీ వరకు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. మండల వైద్యాధికారి మనోజ్, ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

అనంతపురం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కమ్యూకేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని ప్రముఖ రీసోర్స్ పర్సన్, టీసీఎస్ సీనియర్ కన్సల్టెంట్ శేషుకుమార్ సూచించారు. గురువారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హౌ స్టూడెంట్స్ కెన్ ప్రిపేర్ ఫర్ ఇండస్ట్రీ రెడీ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాల గురించి మెలకువలు వివరించారు. కోడింగ్ స్కిల్స్, కమ్యునికేషన్‌స్కిల్స్ గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్మెంట్‌ఆచార్యులు కిరణ్మయి, ప్రాంగణ నియామకాల అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

701.8 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 701.8 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువులను ఏడీఏ పరిశీలించారు. యూరియా 213.8 మెట్రిక్ టన్నులు, 10-26-26 రకం ఎరువులు 244 మెట్రిక్ టన్నులు, 28-28-0 ఎరువులు 244 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. జేసీ ఆదేశాల మేరకు... యూరియా, ఇతర ఎరువులను మార్క్‌ఫెడ్, పలు రిటైల్ డీలర్లకు సరఫరా చేశామన్నారు.

వర్షాలు కురవాలని విరాట పర్వం పఠనం

శింగనమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): వర్షలు సకాలంలో పడి గ్రామం సుభిక్షంగా ఉండాలని గోవిందరాయనిపేట ప్రజలు విరాట పర్వం చవించి పూజలు చేశారు. గురువారం నుంచి స్థానిక కమ్యూనిటీ హాల్‌లో గ్రామ పెద్దలు ప్రజల సహకారంతో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని పూజారులతో విరాటపర్వం పఠనం చేయించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చిన ప్రభుత్వం

శింగనమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందని నాయీబ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ ఆదినారాయణ అన్నారు. గురువారం జూలాకాలువలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. గార్లదిన్నె సత్యనారాయణ, అనీల్‌యాదవ్, వీరాంజనేయులు, పెద్దన్న పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

గార్లదిన్నె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలగాసిపల్లి జంక్షన్ వద్ద ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా అనంతపురం వైపు వెళుతున్న టిప్పర్‌ను గురువారం పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం: పీడీ

శింగనమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే శిశువు ఆరోగ్యంగా ఉంటాడని ఐసీడీఎస్ పీడీ నగమణి అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగహన సదస్సు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్, సీడీపీఓ లలితమ్మ, తరిమెల వైద్యుడు శంకర్‌నాయక్, సిబ్బంది కల్పన ధనలక్ష్మి, కౌసల్య, వాణిశ్రీ, నేతాజీ, ఓబిలేసు పాల్గొన్నారు.

నార్పల: మండలంలోని ఉయ్యాలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం అన్నారు. ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, కార్యకర్తలు శ్రీదేవి, భారతి, జరీనాబేగం, నాగమణి పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి

రాప్తాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని పరిశీలించాలని టీడీపీ కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ నారాయణస్వామి ఆర్డీఓను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్డీఓకు వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ గాండ్లపర్తి, కొత్తపల్లి, బొమ్మేపర్తి రెవెన్యూ పొలాల్లో రీ సర్వే జాయింట్ ఎల్‌పీఎంల సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

ఇంటింటికి బీజేపీ

శింగనమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన ఓబిరెడ్డి ఇంటింటికి వెళ్లి బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఓబిలేసు యాదవ్, వెంకటేశ్, శ్రీనివాసులు, యవరాజ్‌పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..

ఆత్మకూరు ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్ఐ లక్ష్మణరావు విద్యార్థులకు సూచించారు. ఇటీవల పోలీస్ రిక్రూట్‌మెంటులో ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన కనికిరెడ్డి కుమార్ రెడ్డిని ఎస్ఐ, స్టేషన్ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శైలజా అన్నారు. గురువారం స్థానిక మండల చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో జాతీయ జెండాను ఆగస్టు 13 నుంచి 15వ తేదీరకు ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్ రాజ్, ఎంపీపీ సునీత, ఏపీఎం అనిత, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జడ్పీ యూనిట్ అధ్యక్షుడిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి



జిల్లా పరిషత్ యూనిట్ నూతన కార్యవర్గం..

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా ప్రజాపరిషత్ యూనిట్ ఎన్నిక గురువారం సాయంత్రం స్థానిక జడ్పీ కార్యాలయంలో చేపట్టారు. అందులో బాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏఓ విజయభాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా జూనియర్ అసిస్టెంట్ రామకిశోర్, ప్రధానకార్యదర్శిగా మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా మల్లికార్జున, ట్రెజరర్‌గా షబ్బీర్ నియాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుకన్య, ఈసీ మెంబర్లుగా అల్లాబకాష్, రామ్మోహన్ నాయుడు, నందకిషోర్, హరిక్రిష్ణ, రామక్రిష్ణ, రాఘవేంద్రుడులను ఎన్నుకున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే మీ సమస్య-మా బాధ్యత

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే మీ సమస్య-మాబాధ్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి అన్నారు. గురువారం గరిమేకలపల్లిలో మీ సమస్య-మా బాధ్యత కార్రక్రమాన్ని నిర్వహించారు.



గరిమేకలపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎల్ నారాయణచౌదరి, నాయకులు

రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర, మంగాపురం ముత్యాలు, బ్రహ్మ, ఆదిశేషు, సత్యమప్ప, రాధాకృష్ణ, సుబ్బరాయుడు, గోపాలప్ప, మూర్తి పాల్గొన్నారు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ సదాశివన్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి, నాగసముద్రం గ్రామాల్లో మీ సమస్య మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ అశోక్‌నాయక్ పాల్గొన్నారు. రాప్తాడు మండలం మరూరు గ్రామంలో చిన్నకదరయ్యస్వామి ఆలయం వద్ద మీ సమస్య మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామస్థులు 144 మంది అర్జీలు అందించారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహులు, మాజీ జడ్పీటీసీ కుళ్లాయప్ప పాల్గొన్నారు.



పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో బంగి నాగ, ఇతర నాయకులు

శ్రేణులకు టీడీపీ అధిష్టానం అండ

అనంతపురం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అనంతపురం అర్బన్ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు గురువారం ఆయన నగరంలోని పలువురు టీడీపీ నాయకులను కలిశారు. హమాలీ కాలనీలో ఉన్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ ఇంటికి వెళ్లారు. బంగి నాగ ఆయనను ఆహ్వానించారు. సోమిశెట్టి మాట్లాడుతూ...క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు టీడీపీ తోడుగా ఉంటుందన్నారు. ప్రజా సంఘాల నాయకులు బీసీఆర్ దాస్, బీకేఎస్ ఆనంద్, దాసాని కుళ్లాయప్ప, చిన్న కేశవులు, ఆదినారాయణ, సూరి, నరసింహులు, మల్లికార్జున, బంగి మల్లేష్, శ్రీనివాసచౌదరి, రమేష్, హనుమంతరావు, సత్య, మునియమ్మ, వెంకటేష్ గౌడ్, సాకే వెంకటేష్, సాకే చంద్రశేఖర్, రామాంజులు, సున్నం శీన, పృథ్వీ, సాదిక్, విద్యాసాగర్ రావు, సాయి, డేవిడ్ పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడేవారికే గుర్తింపు



సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు స్వాగతం పలుకుతున్న విజయశ్రీ, శ్రీనివాసరెడ్డి

అనంతపురం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడితే మంచి గుర్తింపు ఉంటుందని టీడీపీ అనంతపురం అర్బన్ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పార్టీ ఆదేశాల మేరకు ఆయన నగరంలోని పలువురు టీడీపీ నాయకులను కలిశారు. 6వ రోడ్డులో ఉన్న మాజీ కార్పొరేటర్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, మాజీ యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి దంపతుల ఇంటికి వెళ్లారు. సోమిశెట్టికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పలు అంశాలపై పరిశీలకులు, టీడీపీ నాయకులు చర్చించారు. బూత్ కన్వీనర్ రామాంజనేయులు, ఎల్పీ నగర్ శీన, మెడికల్ బాబా, సురేష్, మహబూబ్‌భాషా, సంజీవకుమార్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలకు రైతులను ఎంపిక చేయండి

అనంతపురం అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పథకాలకు అర్హులైన రైతులను ఎంపిక చేయాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి ఆదేశించారు. గురువారం స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏడీ దేవానంద్‌తో కలిసి హెచ్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. ఆర్‌కేవీవై, ఎంఐడీహెచ్ కింద నిర్దేశించిన సమయంలోగా లబ్ధిదారుల జాబితాను తయారు చేసి, మంజూరు ఉత్తర్వులు జారీ చేసేలా చొరవ చూపాలన్నారు. ఉద్యాన పంటల సాగులో రైతులకు తగిన సూచనలు అందజేసి, అండగా ఉండాలన్నారు.

ఎస్సీ కాలనీలో తీరిన తాగునీటి సమస్య

శింగనమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీరనుంది. దాహపు కేకలు అన్న కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రత్యేక నిధుల నుంచి రూ.2.5 లక్షలు మంజూరు చేయడంతో గురువారం ఎంపీడీఓ భాస్కర్ డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవీంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, వీఆర్‌ఓ ఎర్రితాతయ్య కాలనీలో బోరు వేయించారు. అందులో నీరు పుష్కలంగా పండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేసున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

రామగిరి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిచెందిన నసనకోట ముత్యాలమ్మ ఆలయ హుండీని గురువారం లెక్కించినట్లు ఈఓ వెంకటేశులు తెలిపారు. 72 రోజుల తరువాత హుండీ లెక్కించామని, రూ.6,49,073 ఆదాయం వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమానికి దేవదాయశాఖ సహాయ కమిషనర్ నరసింహరాజు హాజరయ్యారన్నారు. నసనకోట, ముత్యాలంపల్లి, గంగంపల్లి గ్రామస్థులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి

నార్పల,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్థంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. గ్రంథాలయ అధికారి కావేరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రవీంద్రనాథ్ రచించిన గొప్ప కావ్యం గీతాంజలితో పాటు ఆయన రచించిన పుస్తకాలను ప్రదర్శన నిర్వహించారు. సామాజిక సేవా కార్యకర్త రిటైర్డ్ కండక్టర్ ప్రసాద్, అటెండర్ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
PUBLIC GOLD AUCTION NOTICE
GSTN – 37AACK9347FIZD
Registered Office: #54-9-23, 100Feet Road, Auto Nagar, Vijayawada, Krishna, AP-520007
ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు యావన్మంది ప్రజలకు ఇందుమూలంగా తెలియచేయునది ఏమనగా దిగువ శాఖలలో తనఖా ఉంచిన బంగారు ఆభరణాలు యొక్క బహిరంగ వేలం దిగువ పేర్కొనబడిన శాఖ వద్ద కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా నిర్వహించుటకు ప్రతిపాదించబడినది. దిగువ పేర్కొనబడిన లోన్ నెంబర్ యొక్క రుణగ్రహీతలు కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్ నందు బంగారు రుణసౌకర్యం పొందారు. పొందిన బంగారు రుణాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, మరియు పంపిన నోటీసులకు స్పందించని కారణంగా తనఖా ఉంచిన బంగారు ఆభరణాలను క్రింది తెలిపిన సమయాలలో వేలం వేయుటకు ప్రతిపాదించడమైనది. వేలం తేదీలో ఏమైనా మార్పులు ఉంటే వేలం జరిగే ప్రదేశంలో ప్రచురించబడుతుంది.
1st Auction Date: 28-08-2025 Time : 11:00am Auction Center : 2 nd Floor, Subhash Road, Near Clock Tower, Anantapuram-515001.
2nd Auction Date: 18-08-2025 Time : 11:00am Auction Center :Head Office100 Feet Road,Auto Nager,Vijayawada-520007
PledgesList:Ananthapuram:ANP/30286, 30178,30254,30255,30212,30198,30209, 30278,30169,30213,30170,30204,30184, 30185,30190,30096,29676,30208,30215, 29684,30103,3112,29544,30186,30123, 30124, 30090,29583,29638, 30241,30219, 30083,30126,30221,30095,30146,30277, 30269,30276,30210,30245,30160,3027, 30180,29675,30097,Dharmavaram:DVM/ 6082, 5528,5996,6003,6033, 6141,6125, 6074,6079,6122, 6174,6068,6181,5976, 6084,6119,6138,6151,6159,6168,6111. Guntakal:GTG/2267,2651,2700,2233,2259 ,2253,2262,2270,2310,2311,2312,2722, 2723.Hindhupur:HPG/4205,3874,4307, 4299.Kalyanadurgam:KYG/4928,4413,43 67,4365,4788,4831,4832,4368,4433,4922 Kadiri:KRG/3789,3749,3750,3799,3805,38 07,3812,3813,3814,3831,3844,3845,3856, 3499,3501,3838,3873.Rayadurgam:RDG/ 4177,4274,4190,4918,4854,4924,4271, 4882,4832,4984,4944,4267,4316,4806, 4162,4229,4277,4834.Tadipatri:TUG/3222, 3223,3215,3212,3202,3220,3221,3225, 3226,3228,3229,3269,3276,3216,2911, 3230,3233,3284,3264,Uravakonda:UKG/ 1487,1433,1493,1408,1388,1374,1403, 1449,1431,1469,1362,985,1498,1491,1393 ,1451,1500,1020,1425,1485,1434,1357, 1375,1426,1404,140,1409,1412,1448,1453 ,1454,1455,1464,1472,1489,1492.G: GYG/1323,1240,1290,1247,1093,1314.
Reserve Price : 9449/-
ఆసక్తిగల ప్రజలు బిడ్డింగ్‌లో పాల్గొనవచ్చు. బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఫోటో ఐడి ప్రూఫ్, పాన్‌కార్డ్ మరియు జీఎస్టీ సర్టిఫికేట్‌ను కలిగి ఉండాలి. విజయవంతమైన బిడ్డర్లు పూర్తి వేలం మొత్తాన్ని RTGS ద్వారా బదిలీ చేయాలి.
గమనిక: వేలం తేదీకి ముందు వినియోగదారులు బంగారు ఆభరణాలను విడుదల చేయవచ్చు.
Please contact : Ph : 8712444616 for more information.
KANAKADURGA FINANCE LIMITED

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ కార్యాలయము , అనంతపురం .
వాహనము వేలం ప్రకటన
బ్యాంకు నందు సెక్యూరిటీగా గల దిగువ తెలిపి ఖాతాలో ఉన్నటువంటి తనఖా వాహనాన్ని యూనియన్ బ్యాంక్, పాపంపేట శాఖ నందు వేలం ద్వారా విక్రయించుటకు సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది. ఆసక్తి గల వ్యక్తులు మా యొక్క పాపంపేట శాఖ నందు 18.09.2025 సా॥ 5.00 గం॥లలోపు దరఖాస్తు చేసుకోగలరు. టెండర్లను 19.09.2025 శుక్రవారము ఉ॥ 11.00 గం॥లకు తెరువబడును. ఉన్నతాధికారులచే సదరు టెండర్లను పరిశీలించి నిర్ణయం తీసుకోబడును. తదుపరి వారి టెండర్లు రెండు రోజులలోపల సఫలీకృత బిడ్డరుకు తెలుపబడును. వేలం వేసేందుకు ప్రతిపాదించబడి, సెక్యూరిటీగానున్నటువంటి తనఖా వాహనం యొక్క వివరములు దిగువ పేర్కొనబడినవి.

ఖాతాదారుని పేరు	వాహనము & మోడల్	వాహనము రిజిస్ట్రేషన్ నెం.	రిజర్వు ధర & ధరావత్తు
శ్రీ అన్నెం రామక్రిష్ణారెడ్డి	SANTRO 1.1 MTCNG SPORTZ EXECUTIVE, 2022	AP39QQ0849	Rs.3,00,000/- & Rs.30,000/-

సదరు వేలం దిగువ తెలిపిన నియమనిబంధనలకు లోబడి ఉంటుంది:- -1) ఎక్కడ ఎలా ఉన్నది అలానే ప్రాతిపదికపై జరుగును. 2) వేలం నందు పాల్గొనుటకు ఆసక్తి గల వ్యక్తులు 10% రిజర్వు ధరను సెక్యూరిటీ డిపాజిట్‌గా సమర్పించాలి. సదరు డిపాజిట్‌ను అసఫలీకృత బిడ్డరులకు వేలం ముగిసిన పిమ్మట బ్యాంకుచే తిరిగి వాపసు ఇవ్వబడును. 3) ఒకసారి బిడ్ ముగిసిన పిదప, సెక్యూరిటీగానున్నటువంటి వాహనం యొక్క నాణ్యత విషయమై ఎలాంటి క్లెయిమ్స్/ఫిర్యాదులను బ్యాంకు అంగీకరించదు. 4) సఫలీకృత బిడ్డరు బిడ్ సొమ్ము పూర్తి మొత్తాన్ని (సెక్యూరిటీ డిపాజిట్ మినహాయించి) తక్షణమే చెల్లించి సెక్యూరిటీగా నున్నటువంటి వాహనాన్ని అతను/ఆమె యొక్క స్వంత వ్యయ ప్రయాసలతో తీసుకొని పోవలసి ఉంటుంది. అటుపిమ్మట ఏ విషయంలోనూ బిడ్డరు, బ్యాంకు మధ్య ఎలాంటి సంబంధం ఉండదు. 5) ఎలాంటి కారణము చూపకుండానే అవసరం మేరకు సెక్యూరిటీగానున్నటువంటి వాహనం వేలం వేయుటకు లేదా వేలం నిలిపివేయుటకు బ్యాంకుకు పూర్తి హక్కు కలదు. 6) లోటు సొమ్ము ఏమైనా ఉన్నట్లయితే బ్యాంకు యొక్క నియమ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకొనును. ఎలాంటి కారణము చూపకుండానే ఏదేని ఒక బిడ్ అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంకుకు పూర్తి హక్కుగలదు. ఒక వేళ సఫలీకృత బిడ్డరు సకాలంలో బిడ్ సొమ్మును చెల్లించని పక్షంలో/బిడ్డరు చర్యల వలన వేలం అమ్మకం సజావుగా సాగనందులకు/పొడిగించవలసి వచ్చుటకు/రాజీగా నూతన వేలం అమ్మకం నిర్వహించవలసి వచ్చిన పక్షంలో వేలం సక్రమంగా నిర్వహించే క్రమంలో అతను/ ఆమె వలన సంభవించిన ఒడిదుడుకుల వలన కలిగిన నష్టాలేమైనా ఉన్న యెడల వాటన్నింటిని సఫలీకృత బిడ్డరే స్వయంగా భరించాలి.
తేదీ:06.08.2025 సం/-రీజనల్ హెడ్

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి పోటీలకు ఓమేశ్వరి



రాయదుర్గం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ ఆర్‌టీఐ యాక్ట్-2005 అంశంపై జూలై ఆరున కడపలో నిర్వహించిన జోనల్‌స్థాయి వ్యాసరచన పోటీలో స్థానిక కేటీఎస్ కళాశాల మైక్రో బయాలజీ తృతీయ సంవత్సరం విద్యార్థిని సీ ఓమేశ్వరివాణి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 11న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఆమెను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు గురువారం అభినందించారు.

కూటమి హామీలను నెరవేర్చాలి: సీపీఐ



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న సీపీఐ నేత జాఫర్

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎస్ ఫంక్షన్ హాలులో సీపీఐ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల మహాసభను గురువారం నిర్వహించారు. ఇందులో జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా గుంతపల్లి కురుబ గోపాల్‌ను మూడోసారి, అలాగే నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా శెట్టూరు బోయ నరసింహులును రెండో సారి ఎన్నుకున్నారు. 55 మంది కౌన్సిల్ సభ్యులుగా ప్రతిపాదించారు. కార్యక్రమంలో నాయకులు ఓబుళపతి, సంతోష్, జాన్సన్ పాల్గొన్నారు.

● పామిడి: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల మహాసభను గురువారం నిర్వహించారు. మొదట స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి షాదీఖానా వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ.. నగర పంచాయతీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను రద్దు చేసి అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

12న కౌలుకు బహిరంగ వేలంపాట

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి, శ్రీ చింతల వెంకటరమణస్వామి ఆలయాలకు చెందిన భూములకు సంబంధించి కౌలుకు బహిరంగ వేలంపాటను ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి మండలంలోని వంగనూరు సమీపంలో, యాడికిలో మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామంలో ఆలయాలకు చెందిన భూముల కౌలుకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10:30 గంటలకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

సజావుగా బహిరంగ వేలం

ఉరవకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆదాయానిచ్చే వనరులకు గురువారం వేలంపాట నిర్వహించారు. టెంకాయలు అమ్ముకొను హక్కును ప్రొద్దుటూరుకు చెందిన ప్రసాద్ రూ.24.80 లక్షలకు, కొబ్బరి చిప్పల సేకరణ హక్కుకు చిన్నముష్టూరు చెందిన చిన్న మల్లి రూ.6.85 లక్షలకు దక్కించుకున్నారు. తలనీలాలు, కలగలుపు బియ్యం, బేడలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే తక్కువకు పాడడంతో వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు, పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యల్లనూరు రోడ్డు సమీపంలోని ఒక వెంచర్ పక్కన ఉన్న డ్రైనేజీ నీటిని అండర్ డ్రైనేజీకి మళ్లించారు. దీంతో అండర్ డ్రైనేజీ పూర్తిగా స్తంభించి మురికినీరు అంతా రోడ్లపైకి వస్తుండటంతో భగత్‌సింగ్‌నగర్, సంజీవనగర్, టైలర్స్‌కాలనీ, జయనగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ఎస్‌పీ-2లోని పాత మోటార్లను తొలగించి కొత్త పంపు మోటార్లను ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. దీంతో ఆయాకాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది.

పాఠశాల తనిఖీ

యాడికి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాల నెంబరు-4ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం పక్కనే ఉన్న భవిత కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

డాక్టర్ స్వామినాథన్‌కు ఘన నివాళి

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ స్వామినాథన్ జయంతి సందర్భంగా స్థానిక రైతు సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు గురువారం నివాళులర్పించారు. ఇందులో రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, నాయకులు ఆదినారాయణ, సంజీవ, హరి, శీనా, శిరీష పాల్గొన్నారు.

శిథిలావస్థలో హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటర్ షట్టర్లు

ఉరవకొండ,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు సమీపంలోని హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటర్ షట్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. హెచ్చెల్సీ ఆధునీకరణలో భాగంగా వీటిని నిర్మించాల్సి ఉండగా, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పుష్కర కాలం దాటినా ఆ దిశ చర్యలు చేపట్టలేదు. షట్టర్లు ఉన్న ప్రాంతంలో రాళ్ల కూడా ఊడిపోయి ప్రమాదాకరంగా మారింది. షట్టర్లు మొత్తం తుప్పు పట్టిపోయాయి. మొత్తం ఐదు షట్టర్లు ఉండగా, రెండు చోట్ల షట్టర్లు పూర్తిగా లేవు. ఇనుప కడ్డీలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాగా, ఈ నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామనిహెచ్చెల్సీ అధికారులు తెలిపారు.



దెబ్బతిన్న హెడ్ రెగ్యులేటర్, షట్టర్లు

31న మద్యం షాపులు మూయించండి

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ నేపథ్యంలో ఈనెల 31న సామూహిక వినాయక నిమజ్జనాన్ని చేపడుతున్నామని, ఆ రోజు మద్యం షాపులను బంద్ చేయించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సోమశేఖర్‌కు జై శ్రీరామ్ భక్తమండలి సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. కొంతమంది ఆకతాయిలు ఊరేగింపులో మద్యం సేవించి అశ్లీల నృత్యాలు చేస్తూ.. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. అలాగే నిమజ్జనం సమయంలో పలు రంగుల పౌడర్లను చల్లుతున్నారని, వాటి వల్ల ప్రజ లు అనారోగ్యాలకు గురవుతున్నారని, అలాంటి వాటిని విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో భక్తమండలి సభ్యులు రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, వీరప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కోసం పాట్లు

● పుట్లూరులో దాతలు బోర్లు వేసినా పట్టించుకోని అధికారులు
● నీటి కోసం పొలాలకు పరుగులు తీస్తున్న ప్రజలు





పుట్లూరులో తోట వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ రాయలచెరువులో ట్యాంకర్ వద్ద మహిళలు

పుట్లూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పుట్లూరులో చెరువు ఉన్నా... గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిరోజులుగా ఉన్న బోర్లలో నీరు సరిగా రాకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఇటీవల ఈ గ్రామానికి చెందిన పుల్లారెడ్డి అనే దాత బోరు వేయించి పంచాయతీ అధికారులకు అప్పగించాడు. అందులో నీరు పుష్కలంగా ఉంది. దానికి మోటార్, విద్యుత్ కనెక్షన్‌కు నిధులు లేవంటూ అధికారులు చేతులెత్తేశారు. అదే అధికారులు గ్రామశివార్లలో నుంచి నీటి సరఫరా చేస్తున్న ట్యాంకర్‌కు ట్రిప్‌కు రూ. 700 ప్రకారం చెల్లిస్తుండటం విడ్డూరం. ఆ నీరు ప్రజలకు సరిపోవడం లేదు. దీంతో సొంత పనులు విడిచిపెట్టి నీటి కోసం వాహనాల్లో రెండు కిలోమీటర్ల దూరంలోని పొలాలకు వెళ్తున్నారు. దీనిపై డిప్యూటి ఎంపీడీఓ శివప్రసాద్‌ను వివరణ కోరగా తాగునీటి సమస్య ఉన్న మాట వాస్తవమేనని, రెండు,మూడు రోజుల్లో గండికోట పైప్ లైన్ మరమ్మతులు పనులు పూర్తి చేసి నీటిని ప్రజలకు అందిస్తామని అన్నారు.

రాయలచెరువులోనూ ఇదే దుస్థితి

యాడికి: మండలంలోని రాయలచెరువులోని బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో.. నీటిఎద్దడి నెలకొంది. స్థానిక హైస్కూల్ వెనుక వీధివాసులు, కొత్త ఇళ్ల కాలనీల్లో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయినా ఆ నీరు సరిపోవడం లేదు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. గ్రామంలో ఉన్న మూడు తాగునీటి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోయాయని తెలిపారు. హైస్కూల్ వెనుక ఉన్న కాలనీ ఎత్తు ప్రాంతంలో ఉండటంతో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్ నుంచి సరఫరా అయ్యే నీళ్లు ఎక్కడం లేదన్నారు. నీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకుపోయామని, త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.





తాడిపత్రి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, రాయదుర్గంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా జిహ్వేశ్వరస్వామి జయంతి

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్వకుళసాలి సామాజిక వర్గ ఆరాధ్య దైవం, సమాజ మూలపురుషుడు జిహ్వేశ్వరస్వామి జయంతిని స్థానిక అంబాభవానీ దేవాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, స్వకులశాలి సంఘం ప్రెసిడెంట్ చంద్రశేఖర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శారద పాల్గొన్నారు.

● రాయదుర్గం: జిహ్వేశ్వరస్వామి జయంతిని స్థానిక శ్రీహటకేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించారు. అనంతరం సమాజ సత్రంలో నామకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని, ఉత్సవ మూ ర్తిని వెండిరథంపై ఉంచి.. పట్టణ వీధుల్లో ఊరేగించారు. స్వకుళసాలి సమాజానికి చెందిన 10, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, సమాజ అధ్యక్షుడు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆనందరావు, విమల పాల్గొన్నారు.

పోలీసుల కొరత.. కొరవడిన నిఘా..!

50 మందికిగాను ఉన్నది తొమ్మిది మందే..



విడపనకల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు, పాల్తూరు పోలీస్‌స్టేషన్లలో దాదాపు 50 మంది పోలీస్ సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం తొమ్మిది మందే ఉన్నారు. దీంతో గస్తీ నిఘా తగ్గడంతో గ్రామాల్లోని ఇళ్లల్లో దొంగతనాలు, బైక్‌ల అపహరణ, పొలాల్లో పైపులు, మోటార్ల చోరీలు అధికమయ్యాయి. విడపనకల్లు పోలీస్ స్టేషన్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. అధికారులు లెక్కల ప్రకారం 13 మంది ఉన్నారు. అయితే అందులో సీఐ కార్యాలయంలో నలుగురు, డీఎస్పీ కార్యాలయంలో నలుగురు అటాచ్‌మెంట్‌పై వెళ్లారు. ఒకరు కోర్టు కానిస్టేబుల్‌గా వెళ్లారు. ఇక మిగిలింది నలుగురు మాత్రమే. అలాగే పాల్తూరు పోలీస్ స్టేషన్‌లోను 24 మందికిగాను అధికారికంగా 13 మంది ఉన్నారు. అందులో ఎనిమిది మంది డూయింగ్ డ్యూటి అని, అటాచ్‌మెంట్ అని బయటకు వెళ్లి పోయారు. ఇక మిగిలింది ఐదుగురే. ఈ రెండు పోలీస్‌స్టేషన్లలోని తొమ్మిది మంది సిబ్బందిలో బందోబస్తు నిమిత్తం ఐదుగురు వెళ్తుంటారు. దీంతో ఇక కేవలం నలుగురు మాత్రమే అందుబాటులో ఉంటారు. మండలంలో మొత్తం 17 పంచాయతీల్లో 19 గ్రామాలున్నాయి. పోలీస్ సిబ్బంది కొరత వల్ల గ్రామాల్లో రాత్రిపూట గస్తీలు లేకుండా పోయాయి. దొంగలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. గడేకల్లు, డొనేకల్లు, హావళిగి, పాల్తూరు, చీకలగురికి, ఉండబండ, వేల్పుమడుగు తదితర గ్రామాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. వేల్పుమడుగులో 15 రోజుల క్రితం ఆ గ్రామ సర్పంచ్ తిప్పారెడ్డి ద్విచక్రవాహనాన్ని, అదే గ్రామంలో మరో వ్యక్తి ద్విచక్రవాహనాన్ని ఒకే రోజు అపహరించారు. విడపనకల్లులోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న ఇళ్ల ముందు ఉన్న రెండు ద్విచక్రవానాలు ఎత్తుకెళ్లారు. గడేకల్లులో ఒకే రోజు ఐదు చిల్లర దొంగతనాలు, హావళిగి గ్రామంలోను కిరాణ షాపుల్లోను, పొలాల్లోను పైపులు, మోటార్లు ఎత్తుకెళ్లారు. పాల్తూరు గ్రామంలో పశువులను ఎత్తుకెళ్లారు. జిల్లా అధికారులు స్పందించి తగినంతమంది పోలీసులను నియమించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బొమ్మనహాళ్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో అనారోగ్యంతో జంగమ బసవరాజుస్వామి (50) గురువారం మరణించాడు. అతని మృతదేహానికి టీడీపీ నాయకుడు సోమనాథ్‌గౌడ్ నివాళ్లు అర్పించారు. అంత్యక్రియలకు రూ.6వేలను బాధిత కుటుంబానికి అందజేశారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ, ఆర్డీటీ లబ్ధిదారులతో కలసి స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, అధ్యక్షుడు చంద్ర,నాయకులు వైటీసీ రమేష్, వంశీ, రామాంజినేయులు పాల్గొన్నారు.

● కూడేరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, యువత ఆర్డీటీని కాపాడాలని కూడేరులో నిరసన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ హరి రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

● కళ్యాణదుర్గంరూరల్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని స్థానిక ఆర్‌అండ్‌బీ గృహంలో ఐక్య దళిత సంఘాల సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి అక్కులప్ప నిర్వహించారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ కొనసాగించే వరకు రైల్‌రోకో, పోస్టాఫీసు, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు ముట్టడి, జాతీయ రహదారుల దిగ్బంధం తదితర పోరాటాలు చేస్తామన్నారు.

తుప్పు పట్టిన జనరేటర్

ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా..!



బొమ్మనహాళ్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు ... ఆన్‌లైన్ సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడరాదని ప్రభుత్వం జనరేటర్లను మంజూరు చేసింది. అందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి ఓ జనరేటర్‌ను మంజూరు చేసింది. అయితే దాన్ని ఆరుబయట ఉంచడంతో.. ఎండకు ఎండి.. వానకు తడిసి... దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం చెడిపోయింది. దానికి మరమ్మతులు చేయించి.. వినియోగంలో తెచ్చేలా చూడాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. దీంతో రూ. లక్షల విలువైన జనరేటర్ పూర్తిగా శిథిలమైంది. తరుచూ విద్యుత్ సరఫరా గంటల తరబడి ఆగిపోతుండటంతో ప్రజలు ఆన్‌లైన్ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి జనరేటర్‌కు మరమ్మతులు చేయించి.. వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం న్యూస్..

విద్యుదాఘాతంతో మహిళ మృతి



కావేరమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని దొడఘట్ట గ్రామంలో బోయ కావేరమ్మ (52) గురువారం తన ఇంట్లో ప్లగ్ పెడుతుండగా.. విద్యుదాఘాతానికి గురైంది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఆమెకు భర్త రామాంజి, కుమారులు సురేంద్ర, కృష్ణ, విజయ్, కుమార్తెలు చిట్టి, మీనాక్షి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చానిపల్లి గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన నరేష్, వీరాంజనేయులు గురువారం బైక్‌పై వెళ్తుండగా.. పంది అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడ్డవారిద్దరినీ స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైనా చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వైసీపీ మద్దతుదారులపై దాడులు

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నబజారులో నివాసముంటున్న వైసీపీ మద్దతుదారుడు షబ్బీర్ తన ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అలాగే చేనేత కాలనీకి చెందిన వైసీపీ మద్దతుదారుడు పరమేశ్ ఇంటిపై గుర్తు తెలియని వారు దాడి చేసి కిటికీలో నుంచి కట్టెతో కొట్టి గాయపరిచారు. రజకవీధికి చెందిన వైసీపీ మద్దతుదారుడు లక్ష్మీరంగయ్య ఇంటిపై దుండగులు బీరు బాటిల్, రాళ్లతో దాడి చేశారు. వీటిపై విచారించి కేసు నమోదుచేస్తామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కేశవరెడ్డిపై గత నెల ఏడో తేదీన హత్యాయత్నం జరిగింది. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన రాజేష్, సాయికుమార్, అంజనేయులు, ఓబులేసు, రాజును గురువారం అరెస్ట్ చేశామని సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. వారి నుంచి మూడు కత్తులు, మూడు కట్టెలను స్వాధీనం చేసుకొని.. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

పీఏసీఎస్ సభ్యుల ప్రమాణస్వీకారం



ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తున్న తలారి మస్తానప్ప

గుంతకల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ చైర్మన్‌గా తలారి మస్తానప్ప, సభ్యులు స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం ఎదుట గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో సహకార పరపతి సంఘాల ఈఏఓ శ్రీనివాసులు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. రానున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాల్టీల ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, కేసీ హరి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఏజీపీ హేమాద్రి, గుణశేఖర్, పజులు, రామన్న చౌదరి, తలారి సరోజమ్మ, పత్తి హిమబిందు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సంజప్పతాత రథోత్సవం




రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడిలో గురువారం సంజప్పతాత రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను, హోమాలు చేపట్టారు. ఉదయం మడుగు తేరును నిర్వహించారు. సాయంత్రం రథాన్ని ఆలయం నుంచి బసవన్న కట్ట వరకూ లాగారు.

రిజర్వాయరులో 1.811 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుత నీటి నిల్వ 1.811 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. ఇన్‌ఫ్లో 2,410 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,370 క్యూసెక్కులు ఉందన్నారు.

చేనేతల సంక్షేమమే ధ్యేయం: విప్



ఉరవకొండలో కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

రాయదుర్గం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతల సంక్షేమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అనేక పథకాలను అమలు చేస్తూ వారిని ఆదుకుంటోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని చేనేతలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి మగ్గం నేశారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొరాళు పురుషోత్తం, చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టంకశాల హనుమంతు, కౌన్సిలర్లు బుళ్లారి జ్యోతి పాల్గొన్నారు.

● యాడికి : స్థానిక సమావేశ భవనంలో చేనేత కార్మికులను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సన్మానించారు. చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధ చేనేత కార్మికులను సన్మానించారు. చేనేత జౌళీశాఖ అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యాడికిని పట్టుచీరల టెక్స్‌టైల్స్ హబ్‌గా మార్చాలని పలువురు కార్మికులు ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, యాడికి సొసైటీ ప్రెసిడెంట్ చలమారెడ్డి పాల్గొన్నారు.

● ఉరవకొండ : పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో 36 మంది చేనేత కార్మికులను సన్మానించారు. అలాగే వారికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో దేవాంగ సంక్షేమ నాయకులు మల్లేష్, బాలచంద్ర, ఆర్ ఆంజినేయులు, నిమ్మల ప్రసాద్ పాల్గొన్నారు.

● యాడికి: స్థానిక గాంధీవిగ్రహానికి వామపక్ష పార్టీల నాయకులు జూటూరు రఫీ, బషీర్ అహ్మద్, మోహన్, వెంకటరాముడు యాదవ్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేసి.. వారిని ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

● తాడిపత్రి : స్థానిక ఏపీఆర్ ప్యారడైజ్‌లో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు అంకాల్‌రెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరీష్‌రెడ్డి, చేనేత సెల్ కన్వీనర్ నారాయణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.





రాయదుర్గంలో చేనేత కార్మికులకు కేక్ తినిపిస్తున్న విప్, యాడికిలో చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

రైల్వే ఉద్యోగులకు వైద్య శిబిరం

గుత్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే ఆసుపత్రి, స్థానిక రైల్వే హెల్త్ యూనిట్ సంయుక్తంగా గుత్తిఆర్‌ఎస్‌లోని రైల్వే డీజిల్ షెడ్‌లో గురువారం రైల్వే ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వేహాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, వైద్యులు మురళీ, స్థానిక హెల్త్ యూనిట్ ఇన్చార్జి డాక్టర్ విజయలక్ష్మి, హాసీనా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో మరుగుదొడ్ల ఏర్పాటు

తాడిపత్రి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడులో శ్రీ సరస్వతి శిశువిద్యామందిరంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు 32 మంది దాతల నుంచి రూ. 14 లక్షలు విరాళంగా సేకరించారు. ఆ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు వంకదారి పెద్దమద్దిలేటి, భూమా సూర్యనారాయణ హరినాథ్‌రెడ్డి, టంగుటూరి కృష్ణమోహన్, ఈశ్వర్‌రెడ్డి, వెంకట శేషఫణి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందిర భవన నిర్మాణ అధ్యక్షుడు కత్తి రామచంద్రారెడ్డి, సరస్వతి విద్యాపీఠం సమితి సహకార్య వాహిక రాఘవేంద్ర ప్రాంత సహ సంపర్క్ ప్రముఖుడు పరుచూరి రమేష్, కార్యదర్శి చిరంజీవులు, సభ్యులు సుబ్రమణ్యం, జయరామిరెడ్డి, ఎస్వీ రామిరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

In the Court of the MACT 1st Addl. District Judge Ananthapuramu
M.V.O.P.No: 90/2025
Between:
Malyavantham Padmavathi and Others ....Petitioners
And
B.Venkata Narayana and Others..Respondants
Notice to the Respondant No:1
R1: B.Venkata Narayana, S/o B Subbaiah, Driver, D.No. 15/14-A, Gandhi Nagar, Tadipatri Town & Mandal, Ananthapuramu District. (Driver of Lorry bearing No. AP02-TH-4264)
Where as the petitioners has filed a claim petition against you and the same is posted to 25-08-2025 fo your appearance. you are hereby directed to appear before the hon'ble court either in person or through an advocate duly instructed on 25-08-2025 at 10:30 A.M. failing which the matter will be heard and decided exparte.
(By order of the court)
B.HARSHAVARDHAN REDDY, K.BAYAPA REDDY, Advocates, AnanthapuramuCell:9440514220

In the Court of the MACT 1st Addl. District Judge Ananthapuramu
M.V.O.P.No: 91/2025
Between:
Sugali Mangamma and Others..... Petitioners
And
B.Venkata Narayana and Others.... Respondants
Notice to the Respondant No:1
R1: B.Venkata Narayana, S/o B Subbaiah, Driver, D.No.15/14-A, Gandhi Nagar, Tadipatri Town & Mandal, Ananthapuramu District. (Driver of Lorry bearing No. AP02-TH-4264)
Where as the petitioners has filed a claim petition against you and the same is posted to 25-08-2025 fo your appearance. you are hereby directed to appear before the hon'ble court either in person or through an advocate duly instructed on 25-08-2025 at 10:30 A.M. failing which the matter will be heard and decided exparte.
(By order of the court)
B.HARSHAVARDHAN REDDY, K.BAYAPA REDDY, Advocates, AnanthapuramuCell:9440514220